ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 12 సెప్టెంబరు 2024



ఎప్పటికి పూర్తవుతాయో..?

- అసంపూర్తిగా జగనన్న కాలనీలు
- మౌలిక సదుపాయాల కల్పనపై నీలినీడలు
- ఇళ్ల నిర్మాణంలో అధికారుల చేతివాటం
- హౌసింగ్ పీడీని పక్కన పెట్టిన కలెక్టర్
- ఇదీ జగనన్న కాలనీల తీరు..

పేదవాడి సొంతింటి కల నెరవేర్చేందుకు గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు అసంపూర్తిగానే ఉన్నాయి. మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఊరికి దూరంగా ఇళ్ల స్థలాలు కేటాయించడంతో చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపకపోవడంతో కాలనీలన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో పేద వాడి సొంతిల్లు కలగానే మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులకు లక్ష్యాలను పెట్టి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. జిల్లాలో అక్టోబరు చివరి నాటికి 4820 ఇళ్లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇప్పటి వరకు 1557 ఇళ్లు పూర్తి చేశాం అని అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఆ కాలనీలలో ఒక్క వీధిలో కూడా మౌలిక సదుపాయాలు కనుచూపు మేరకు కనిపించడం లేదు. కాలనీలలో మట్టి గుంతలు, పెద్ద పెద్ద బండలు, రాళ్లతో వీధులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. మ్యాప్‌లో దారులైతే కనిపిస్తున్నాయి కానీ కాలనీలలో ఒక్క వీధి కూడా సరిగా లేక వర్షాకాలంలో తేళ్లు, పాములు, ఇతర విషపురుగులు వస్తున్నాయని, చిన్నపిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారని చాలామంది లబ్ధిదారులు వాపోతున్నారు. దాదాపు అరు నెలలుగా హౌసింగ్ అధికారులు ఈ కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యమో.. పాలకుల శాపమో తెలియదు కానీ ఈ కాలనీలలో గత ఏడాది నుంచి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉన్నాయి.



జిల్లా హౌసింగ్ కార్యాలయం

అధికారుల తీరు బాగో లేదు..



జిల్లా ఏర్పడిన తరువాత హౌసింగ్ అధికారుల తీరు రోజురోజుకు దిగజారిపోతోంది. గత ప్రభుత్వంలో రూ.1.80 లక్షలు ప్రతి లబ్ధిదారుడికి ఇస్తే దానిలో తప్పుడు బిల్లులు పెట్టి అందినకాడికి వాటాలు పంచుకున్నారు. ఈసారి కూటమి ప్రభుత్వం పేదవాడి ఇంటి కోసం రూ.4 లక్షలు ఇస్తుందని తెలిసింది. ప్రభుత్వం ఇచ్చే డబ్బు లబ్ధిదారునికి చేరే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ప్రస్తుతం ఉన్న హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సమర్థవంతుడు కాకపోవడం వల్లే జగనన్న కాలనీలలో గత ప్రభుత్వంలో అవినీతి తారాస్థాయికి చేరింది. జిల్లాలో పనిచేస్తున్న ఏఈలు, డీఈలు ఎవరు కూడా ఆయనను పట్టించుకోరు, లెక్కచేయరనే సమాచారం మా దగ్గర ఉంది. పరిపాలన సవ్యంగా సాగాలంటే గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను బదిలీ చేస్తే బాగుంటుంది.

- జి.ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

అక్రమాలు నా దృష్టికి రాలేదు..

జిల్లాలోని జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతి, అక్రమాల నా దృష్టికి రాలేదు. నాకు వాటిపై ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు కూడా చేయలేదు. పరిపాలనలో నాకు ఏఈలు, డీఈలు, మిగిలిన సిబ్బంది పూర్తిగా సహకరిస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక టార్గెట్ ఇచ్చిన మాట వాస్తవమే. 90 రోజుల్లో 4820 ఇళ్లు పూర్తి చేయమని మాకు ఆదేశాలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 1551 ఇళ్లు పూర్తి చేశాం. ఇక్కడికి ఎవరు హౌసింగ్ పీడీగా వచ్చినా నేను పూర్తిగా సహకరిస్తా. కాలనీలలో మౌలిక వసతులను త్వరలో పూర్తి చేస్తాం.

- శివయ్య, ఇన్‌చార్జ్ పీడీ, హౌసింగ్



అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 11: వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాలలో భాగంగా ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు కట్టివ్వాలనే ఆశయానికి హౌసింగ్ అధికారులు తూట్లు పొడిచారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాకు 78,221 ఇళ్లు మంజూరైతే ఐదేళ్లలో కేవలం 30 వేలు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు జరిగాయి అంటే అధికారుల నిర్లక్ష్యం ఏ రేంజ్‌లో ఉందో అర్థం అవుతుంది. ఈ కాలనీలలో సిమెంటు, ఇసుక, కడ్డీలు లబ్ధిదారులకు ఇవ్వకుండా హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం అమ్ముకున్నారని పత్రికల్లో కథనాలు వచ్చినా జిల్లా హౌసింగ్ అధికారులు లైట్‌గా తీసుకున్నారంటే వీరి వెనుక బలమైన నాయకుడి హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి. 2023లో అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వయంగా హౌసింగ్ పీడీని జగనన్న కాలనీల పరిస్థితి గురించి అడిగినప్పుడు ఆయన సమాధానం చెప్పలేకపోయారు. ఈ విషయం సమావేశం అనంతరం కలెక్టర్‌తో చర్చించిన మంత్రి వెంటనే పీడీని బదిలీ చేసి కొత్తవారిని వేయించుకోండి అన్నారని తెలిసింది. ఈ ఏడాది జనవరి 31న అన్నమయ్య జిల్లా హౌసింగ్ పీడీగా భాస్కర్‌ను అప్పటి ప్రభుత్వం నియమించింది. ఆయన ఇక్కడికి వచ్చి విధుల్లో చేరకుండా ఇక్కడ ఉన్న ఇన్‌చార్జ్ పీడీ భారీగా లాబియింగ్ చేసి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా చక్రం తిప్పారని అప్పట్లో ప్రచారం జోరుగా సాగింది. జిల్లా హౌసింగ్ అధికారుల సమావేశంలో తప్పుడు నివేదికలు ఇస్తున్నారని తెలిసి గతంలో ఉన్న కలెక్టర్ గిరీషా ఇన్‌చార్జ్ జిల్లా హౌసింగ్ అధికారిని పక్కన పెట్టి మిగిలిన వారితో సమాచారం తీసుకునేవారని తెలిసింది.

గత ప్రభుత్వంలో హౌసింగ్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ సిబ్బందిపై ఏ రకమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు బలంగానే ఉన్నాయి. అంతేకాకుండా జిల్లాలో ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈలు, ఈఈలు ఎవరు కూడా ఆయనను హౌసింగ్ పీడీగా ఏ రోజు గుర్తించలేదని, వారిని అసలు లెక్కచేయరని ప్రచారం ఉంది. రాయచోటిలోని నారాయణరెడ్డి లేఅవుట్‌లో కాలనీ ప్రారంభం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు 1236 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు జరిగాయి. జగనన్న కాలనీలోకి జిల్లా అధికారులు వచ్చినప్పుడు హడావుడి చేసే హౌసింగ్ సిబ్బంది తరువాత కనుచూపుమేర కనిపించరని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ కాలనీలో పనిచేస్తున్న హౌసింగ్ సిబ్బంది ఇళ్ల నిర్మాణాలను ఆదాయ వనరులుగా మార్చుకుని కేవలం ఇసుక పంపిణీలోనే రూ.2 కోట్లు అక్రమాలు జరిగాయని అప్పట్లో ప్రచారం జరిగింది. ఇదే విషయంపై అక్కడ పనిచేస్తున్న ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు జిల్లా హౌసింగ్ కార్యాలయంలో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుని ఒకరు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన అప్పట్లో అక్కడున్న వారి అందరినీ భయభ్రాంతులకు గురి చేసింది. ఈ విషయంపై విజిలెన్స్ అధికారులు జిల్లా హౌసింగ్ కార్యాలయంలో రికార్డులు తనిఖీలు నిర్వహించి ఏమీ తేల్చలేకపోయారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జగనన్న కాలనీలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సిరికల్చర్ కార్యాలయంలో డీఎస్‌వో రాధ, పోలీసులతో రీలర్లు, బీవైఎస్ నాయకుల వాగ్వాదం



యూనిట్ల కేటాయింపు విచారణలో ఉద్రిక్తత

- ఏకపక్షంగా విచారిస్తున్నారని రీలర్లు, బహుజన నాయకుల నిలదీత
- సిరికల్చర్ కార్యాలయంలో చర్చలు విఫలం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11: మదనపల్లె పట్టణంలోని సిరికల్చర్ కాలనీలో రీలింగ్ యూనిట్లను అనర్హులకు కేటాయించారని చేనేతలు, బహుజన యువజన నాయకులు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో సిరికల్చర్ డీఎస్‌వో రాధ విచారణకు వచ్చారు. బుధవారం స్థానిక సిరికల్చర్ కాలనీలోని రీలింగ్ యూనిట్ల స్థలం వద్దకు డీఎస్‌వో రాధ అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. దీంతో అక్కడికి చేరుకున్న బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ అనర్హుల గురించి విచారణ పూర్తి చేసి నివేదికలు అందించేంత వరకు నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతో దీనిపై చర్చించేందుకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న సిరికల్చర్ కార్యాలయానికి అందరూ వచ్చారు. ఎంతసేపు చర్చించినా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అర్హులైన రీలర్లు నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయకుంటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని పెట్రోల్ తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని రీలర్లను వారించారు. డీఎస్‌వో రాధ మాట్లాడుతూ విచారణ నివేదికలను సిరికల్చర్ కమిషనర్‌కు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఉత్తర్వులను అమలు చేస్తామన్నారు. రీలర్లు, పునీత్ మాట్లాడుతూ అనర్హులకు రీలింగ్ యూనిట్లు కేటాయించారని హైకోర్టులో పిటిషన్ వేశామని, దీనికి నెంబర్ కూడా వచ్చిందన్నారు. స్టే ఉత్తర్వులు వచ్చే వరకు అనర్హులు రీలింగ్ యూనిట్లు నిర్మించకుండా నిలుపుదల చేయాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులు వచ్చేంత వరకు నిర్మాణాలు ఆపలేమని డీఎస్‌వో చెప్పడంతో సమస్య పరిష్కారం కాలేదు.

కస్తూర్బా పాఠశాలల్లోకి

ఇతరులను అనుమతించొద్దు

- ప్రతి పాఠశాలలో వందశాతం హాజరు ఉండాలి
- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 11: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలలో బయట వ్యక్తులను అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రధానోపాధ్యాయులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి సంబంధించిన కుటుంబసభ్యులు కాని బయట వ్యక్తులను కానీ పాఠశాలల్లోకి అనుమతించవద్దని తెలిపారు. ఇటీవల లక్కిరెడ్డిపల్లెలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని అలాంటి సంఘటనలు ఎక్కడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాలల సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో వందశాతం విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, సబ్ కలెక్టర్ నిదియాదేవి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

'విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోండి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకుని చేతి వృత్తులపై అవగాహన పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమల శా ఖ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలుపై జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థికసాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్నాక లబ్ధిదారులకు మొదటి విడతలో రుణసౌకర్యం అందిస్తారన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.15 వేలు విలువ చేసే టూల్ కిట్ అందిస్తా రన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ ల అధికారి సూరిబాబు, డీపీవో ధనలక్ష్మి, డీఆర్‌వో సత్యనారాయణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇసుక బుకింగ్

- సబ్ కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 11: ప్రజలకు ఉచిత ఇసుక విధానంలో భాగంగా కూపన్లు పంపిణీ చేసేందుకు గురువారం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ నిదియాదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూచివారిపల్లె సచివాలయంలో ఇసుక బుకింగ్ పాయింట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొంతమంది దళారులు అక్కడి సిబ్బందితో లాలూచీపడి ఇసుకను పక్కదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'ఉచిత ఇసుక విధానానికి ఆదిలోనే అధికారులు తూట్లు' అనే శీర్షికన వెలువడింది. దీనిపై సబ్‌కలెక్టర్ స్పందించి మంగళవారం ఆ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న తప్పులను గమనించిన సబ్ కలెక్టర్ ఇసుక బుకింగ్ పాయింట్‌ను రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయానికి మార్చారు. కాగా ఇసుక పంపిణీకి తాము సహకరించలేమని కూచివారిపల్లె సచివాలయ సిబ్బంది చేతులెత్తేసినట్లు తెలిసింది. తమపై రాజకీయ, అధికారుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉందని, తమను ఇసుక బుకింగ్ విధుల నుంచి తప్పించాలని నలుగురు సిబ్బంది ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిసింది. ఒకరిని ఇసుక బుకింగ్ విధుల నుంచి తప్పించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసే మరో ముగ్గురిని అదే విధుల్లో కొనసాగాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ ఇసుక బుకింగ్ కేంద్రాన్ని కూచివారిపల్లె నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి మార్పు చేశారు. ఈ మార్పును ప్రజలు గుర్తించి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద ఇసుకను బుకింగ్ చేసుకుని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ల తొలగింపు

పెనగలూరు, సెప్టెంబరు 11: ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న ఈటమాపురం పంచాయతీ పరిధిలోని చాపల గిరిధర్, కోడూరు గంగాదేవిలను ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో జరిగిన బహిరంగ సమావేశంలో ఈ ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లపై భారీ ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి వారిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్

వేంపల్లె, సెప్టెంబరు 11: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సండ్ర అమరేంద్రకుమార్‌ను నియమించారు. ఈమేరకు ఆర్జీయూకేటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ గోపాల్‌రాజుకు రిజిస్ట్రార్‌గా పదవీకాలం పూర్తికావడంతో ఆయన స్థానంలో అమరేంద్రకుమార్‌ను నియమించారు. గతంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఏఓగా ఆయన పనిచేశారు. ఆర్జీయూకేటీలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అమరేంద్రకుమార్ తెలిపారు.



మత్స్యకారుల సమస్యలు తీరేనా..!

- ఐదేళ్లుగా పట్టించుకోని పాలకులు
- జీవో నెంబరు 217 రద్దుతో ఊపిరి పీల్చుకున్న మత్స్యకారులు
- సబ్సిడీ ధరలతో వలలు, మోటారు బోట్ల పంపిణీ చేయాలి



బాహుదా ఫిషరీస్ పాండ్స్ వద్ద చేపల పెంపకానికి సిద్ధం చేసిన చేపల తొట్లు

మదనపల్లె టౌన్/నిమ్మనపల్లి, సెప్టెంబరు 11: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడ్డారు. జీవో నెంబర్ 217 తీసుకొచ్చి వారిని అనేక అవస్థలకు గురి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 217 జీవోను రద్దు చేయడంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. నెల్లూరు జిల్లాకు అనుసంధానంగా వ్యాపారం చేసే అన్నమయ్య జిల్లా మత్స్యకారులకు ఈ జీవో రద్దుతో ఉపశమనం కలిగినట్లు అయింది. దీంతో మత్స్యకారుల సొసైటీలు ఈ ఏడాది కురిసే వర్షాలవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

14 సొసైటీలు..400 సభ్యుల బతుకులు ఈదేనా..?

జిల్లాలో 14 మత్స్యకారుల సొసైటీలు ఉండగా వీటిలో 400 మంది సభ్యులుగా ఉన్నారు. సాధారణంగా ఈ సొసైటీలకు చెందిన సభ్యులు మత్స్యశాఖ ఆధ్వర్యంలో లైసెన్సులు పొంది జిల్లాలోని చిన్న, పెద్ద చెరువులను తీసుకుని వాటిలో చేప పిల్లలను వదిలి మంచి సైజు వచ్చేంత వరకు పెంచుతారు. ముఖ్యంగా జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని బాహుదా డ్యామ్ కింద, పీలేరు మండలంలో రెండు ఫిషరీస్ పాండ్స్ ఏర్పాటు చేసింది. ప్రతి ఏటా ఈ రెండు చోట్ల మత్స్యశాఖ మృగాల, రోహు రకం చేప పిల్లలను గుడ్ల నుంచి పెంచేందుకు బాహుదాలో 32 లక్షల చేప పిల్లలను, పీలేరు ఫిషరీస్ పాండ్‌లో 24 లక్షల చేప పిల్లలను వదులుతారు. ఈ పిల్లలు 82 నుంచి 100 మిల్లీ మీటర్ల పొడవు పెరిగాక, వాటిని మత్స్యకారుల సొసైటీకి విక్రయిస్తారు. కాకపోతే ఫిషరీస్ పాండ్స్‌లో వదిలిన చేపపిల్లలు అన్నీ బతకవు. వీటిలో 56 లక్షల పిల్లలకు గాను, కేవలం 14 లక్షల పిల్లలే బతుకుతాయి.

సోమశిల, వెలిగల్లు రిజర్వాయరు, చెరువుల్లో చేప పిల్లల పెంపకం

జిల్లాలోని బాహుదా, పీలేరు ఫిషరీస్ పాండ్స్‌లో ఉత్పత్తి చేసిన చేప పిల్లలను జిల్లాలోని అన్నమయ్య, సోమశిల, వెలిగల్లు లైసెన్స్‌డ్ రిజర్వాయర్లతో పాటు, చిన్న, పెద్ద చెరువుల్లో వదులుతారు. వీటిలో అన్నమయ్య రిజర్వాయరు తెగిపోవడంతో సోమశిల, వెలిగల్లు రిజర్వాయర్లే మత్స్యకారులకు దిక్కుగా మిగిలాయి. ఇవిపోను జిల్లాలో చిన్నవి, పెద్దవి చెరువులను సొసైటీ సభ్యులు లైసెన్స్ తీసుకుని వాటిలో చేపలను పెంచి పెరిగాక విక్రయించుకుని జీవనం సాగిస్తారు. కాగా వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యశాఖ ద్వారా సొసైటీలకు కేవలం ఒకసారి మాత్రమే చేప పిల్లలను విక్రయించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎప్పుడో 1959 సంవత్సరంలో ఏర్పాటు చేసిన సొసైటీలను రెన్యువల్ చేస్తున్నారే కానీ కొత్త సభ్యులను చేర్చుకోవడం లేదు. ఉదాహరణకు బాహుదా సొసైటీని 107 మంది సభ్యులతో 65 ఏళ్ల క్రితం ప్రారంభించారు. ఈ సొసైటీ కింద ఏడు చెరువులను కేటాయించారు. ఐదేళ్లకు ఒకసారి సొసైటీ ఎన్నికలు నిర్వహించి పాలన సాగిస్తున్నారు. కానీ కొత్త సభ్యులను చేర్చకపోవడంతో పాత సొసైటీలోని సీనియర్లు వృద్ధాప్యరీత్యా మృతి చెందిన వారు పోను ఇప్పుడు బాహుదా సొసైటీలో 22 మంది మాత్రమే సభ్యులు మిగిలారు. ఇప్పటికైనా ప్రభుత్వం మత్స్యకార సొసైటీల బలోపేతానికి కొత్త సభ్యులు చేర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని సభ్యులు కోరుతున్నారు.

సబ్సిడీతో వలలు, మోటారు బోట్ల సంగతేది..

మత్స్యకారులు చెరువుల్లో చేపలు పట్టేందుకు ఉపయోగించే వలలు, మోటారు బోట్లు, చేపలను గ్రామాలకు వెళ్లి విక్రయించేందుకు సైకిళ్లు చాలా అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఈ వస్తువులన్నీ సబ్సిడీ ధరలతో మత్స్యకారులకు పంపిణీ చేసేది. కానీ వైసీపీ పాలనలో వీటి గురించి ఆలోచించే నాథుడే లేకపోయాడు. దీంతో మత్స్యకారులు వలస వెళ్లిపోయారు. ప్రస్తుతం వర్షాకాలంలో సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, రిజర్వాయర్లు నిండితే మత్స్యకారులకు మళ్లీ జీవనం సాగించే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం మళ్లీ మత్స్యకార సొసైటీలకు చేపలు పట్టే వలలు, మోటారు బోట్లు సబ్సిడీ ధరలతో పంపిణీ చేయాలని సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

జీవో నెంబర్ 217 రద్దుతో మత్స్యకారులకు ఊపిరి

టీడీపీ ప్రభుత్వం వచ్చాక జీవో నెంబర్ 217ను రద్దు చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో మాత్రమే 217 జీవోను అమలులోకి తీసుకొచ్చారు. దీని ప్రకారం నెల్లూరు జిల్లాలో చెరువులు, రిజర్వాయర్లలో చేపలు పెంచుకునేందుకు, గ్రామ పంచాయతీలకు మాత్రమే అధికారం ఇచ్చారు. మత్స్యకార సొసైటీలకు ఈ అధికారం ఇవ్వలేదు. దీంతో మత్స్యకారులు తీవ్ర నష్టానికి గురయ్యారు. గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చినా, మత్స్యకారులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. నెల్లూరు జిల్లాతో చేపల వ్యాపారం చేసే ఉమ్మడి చిత్తూరు జిల్లా, కడప జిల్లాలోని మత్స్యకారులకు అనుసంధానం ఉండటంతో ఇక్కడి మత్స్యకార సొసైటీలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేయడంతో మత్స్యకార సొసైటీలు ఊపిరి పీల్చుకున్నాయి. అన్నమయ్య జిల్లాలోని 14 మత్స్యకార సొసైటీలకు చెందిన 400 సభ్యులు తిరిగి లైసెన్సులు పొంది, ఈ సొసైటీల పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లలో చేపల పెంపకం చేపట్టనున్నారు.

ఫిషరీష్ పాండ్స్‌లో చేపల ఉత్పత్తి..

జిల్లాలోని బాహుదా, పీలేరు ఫిషరీస్ పాండ్స్‌లో 56 లక్షల చేప గుడ్లను వదిలి చేప పిల్లల ఉత్పత్తి చేపడతాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఎదిగిన చేపపిల్లలను మత్స్యకారులకు విక్రయిస్తాం. దీంతో పాటు సోమశిల, వెలిగల్లు లైసెన్స్‌డ్ రిజర్వాయర్లలో కూడా చేప పిల్లలను వదులుతాము. మృగాల, రోహు రకం చేపపిల్లల పెంపకంపైనే మత్స్యకారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ రకాలనే పాండ్స్‌లో పెంచుతాం.

- సుష్మిత, అసిస్టెంట్ డైరెక్టర్, మత్స్యశాఖ

75 శాతం సబ్సిడీతో పిల్లలను ఇవ్వాలి..



ఇంతకు ముందు టీడీపీ ప్రభుత్వం సబ్సిడీతో చేప పిల్లలను సొసైటీలకు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం 25 శాతం మాత్రమే సబ్సిడీ ఇచ్చింది. ఇది సొసైటీ సభ్యులకు ఏమాత్రం పనికిరాలేదు. కొత్త ప్రభుత్వం అయినా 75 శాతం సబ్సిడీతో చేప పిల్లలను ఇవ్వాలి.

- రమణయ్య, అధ్యక్షుడు బాహుదా మత్స్యకార సొసైటీ



నిమ్మనపల్లి మండలం బాహుదా ప్రాజెక్టు దిగువన ఉన్న మత్స్యశాఖ కార్యాలయం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదు : ఆర్డీఓ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

రాయచోటి, టౌన్ సెప్టెంబరు 11: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని రాయచోటి ఆర్‌డీఓ రంగస్వామి పేర్కొన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం (1994)పై సబ్ డివిజనల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ సమావేశంలో జిల్లా పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ గత సమావేశం మినిట్స్‌పై చేపట్టిన చర్యలపై డివిజన్‌లో ఫారం ఎఫ్ ఆన్‌లైన్‌లో మూడు నెలలుగా అప్‌లోడ్ చేయని 13 స్కానింగ్ సెంటర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. ఐదు సెంటర్ల యాజమాన్యం నోటీసులకు కారణాలను వివరిస్తూ డిస్ట్రిక్ట్ అథారిటీకి వివరణ ఇచ్చారన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ షోకాజ్ నోటీసుకు జవాబు ఇవ్వని స్కానింగ్ సెంటర్లకు రూ.20,000 జరిమానా విధిస్తామన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం కమిటీ మెంబర్లు సురేంద్రారెడ్డి, నాగేశ్వర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సార్ అహ్మద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ, ఉషారాణి, సుగుణ, పోలీసు శాఖ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్'



పిల్లల తల్లులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

సిద్దవటం, సెప్టెంబరు 11: గర్భిణులు పౌష్టికాహారం తినడంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని కడప జిల్లా వైద్యాధికారి నాగరాజు సూచించారు. మాధవరం పంచాయతీ రామకృష్ణాపురం అంగన్వాడీ స్కూల్లో జరుగుతున్న పోషక అభియాన్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పోషణ అభియాన్ కార్యక్రమం సెప్టెంబరు చివరి వరకు జరుగుతుందన్నారు. గర్భిణులు ఆకు కూరలు, పాలు, గుడ్లు బాగా తీసుకోవాలని ఆయన సూచించారు. పోషక అభియాన్ కార్యక్రమానికి సూపర్‌వైజర్ రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంసీహెచ్ కార్డులో వ్యాక్సినేషన్ గర్భిణులకు ఇచ్చినప్పుడు తప్పకుండా నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకుమార్, ఎంపీహెచ్ఓ నాగవల్లి, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ - ఒకరి మృతి



సుదర్శన్‌రెడ్డి మృతదేహం

జమ్మలమడుగు, సెప్టెంబరు 11: దేవగుడి బైపాస్ రోడ్డుపై బుధవారం ఉదయాన్నే ట్రాక్టర్ స్కూటర్‌ను ఢీకొనడంతో పోచిరెడ్డిగారి అబ్బెన్నగారి సుదర్శన్‌రెడ్డి (41) మృతిచెందగా బీటెక్ విద్యార్థి కాసేంద్రారెడ్డికి గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల మేరకు స్థానిక నాగులకట్ట వీధి వాసులు సుదర్శన్‌రెడ్డి వ్యవసాయంతో జీవిస్తున్నాడు. అయితే సమీ ప బంధువు కాసేంద్రారెడ్డిని కలికిరి జేఎన్‌టీయూ కళాశాలలో చేర్పేందుకు ఇద్దరూ బైక్‌పై కలికిరికి బయలు దేరారు. వీరు ప్రొద్దుటూరు మీదుగా వెళ్లాలని తెల్లవారుజామునే బయలుదేరారు. కాగా దేవగుడి నుంచి వస్తున్న ట్రాక్టర్ వీరి వాహనాన్ని ఢీకొనడంతో సుదర్శన్‌రెడ్డికి తీవ్ర గాయాలపాలుకాగా, విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జమ్మలమడుగుకు తీసుకొచ్చారు. విషమ పరిస్థితిలో ఉన్న సుదర్శన్‌రెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలవైపు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. స్వల్పంగా గాయపడిన కాసేంద్రారెడ్డి జమ్మలమడుగు క్యాంబెల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య ఉదయ, పెద్దకుమారుడు పోచిరెడ్డి 10వ తరగతి, రెండో కుమారుడు సందీప్ 8వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను, ద్విచక్ర వాహనాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళీయాదవ్ తెలిపారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే చేపట్టాలి

ప్రైవేట్‌కు అప్పగిస్తే ఆందోళనలకు సిద్ధం : కౌన్సిలర్లు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 11: పులివెందులలోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పులివెందుల ఆర్డీఓ వెంకటేశులును కలిసి వినతిపత్రం సమర్పించిన ఛైర్మన్ మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. ఇప్పటికే 50సీట్లకు అనుమతి ఇచ్చినా ప్రభుత్వం తీసుకునేందుకు సిద్ధంగా లేదన్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం అందించాలనే ఉద్దేశంతో పులివెందులకు మెడికల్ కళాశాలను నెలకొల్పారని వివరించారు. ప్రైవేట్‌పరం చేసేందుకు ముందుకెళ్తే ఆందోళనలకు సిద్ధమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కిషోర్, గండి రాము, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైవీయూలో ఘర్షణ - విద్యార్థికి గాయాలు


కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: వైవీయూలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. బుధవారం ఉదయం వైవీయూలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ విద్యార్థి స్వామి తన వైపు కోపంగా చూశాడని మైక్రోబయాలజీ విద్యార్థి సురేష్ తన చేతిలో ఉన్న ప్లేటుతో అతన్ని కొట్టాడు. వెంటనే స్వామి క్యాంపస్ హాస్టల్‌కెళ్లి తోటితో కలిసి వచ్చి సురేశ్‌పై స్టీలురైలింగ్‌తో దాడి చేశారు. దీంతో అతని తలకు గాయమైంది. విషయం తెలియగానే వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ విద్యార్థులతో సంఘటనకు గల కారణాలు రాబట్టి విషయాన్ని పోలీసులకు చేరవేశారు. గాయపడిన విద్యార్థికి యూనివర్శిటీలో వైద్యసేవలు చేయించారు. వైవీయూ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనుకోకుండా జరిగిన సంఘటన అని, గతంలో వీరిద్దరి మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేవన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటపలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు., పెండ్లిమర్రి సీఐ చల్లనిదొర సిబ్బందితో హుటాహుటిన యూనివర్శిటీకి వచ్చి సంఘటనకు గల కారణాలు ఆరా తీశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అండర్-14 క్రికెట్ సెలక్షన్స్‌కు అనూహ్య స్పందన

250 మందికి పైగా హాజరు - 90 మంది ఎంపిక

కడప (స్పోర్ట్స్) సెప్టెంబరు 11: జిల్లా క్రికెట్ సంఘం సారథ్యంలో బుధవారం రిమ్స్ సమీప వైఎస్‌రాజారెడ్డి ఏసీఏక్రికెట్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 సెలక్షన్స్‌కు యువ క్రీడాకారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు హాజరవగా 90 మందిని ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 13వ తేదీ శుక్రవారం మూడు మైదానాల్లో ప్రాబబుల్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్టుగా ఎంపిక చేసి వారితో జిల్లాకు ఆడిస్తామని క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ ఫలితాలు విడుదల



పీజీ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టరు ఫలితాలను వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి బుధవారం తన ఛాంబరులో విడుదల చేశారు. ఎమ్మెస్సీ బోటనీ, బయో కెమిస్ట్రీ, జియాలజీ, బయోటెక్నాలజీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, జెనిటిక్స్ అండ్ జునోమిక్స్ సైకాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఎంఏ తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ, పీఎస్ అండ్ పీఏ ఎకనామిక్స్, ఎంకామ్, కామర్స్, ఉర్దూ 100 శాతం ఫలితాలు రాగా జువాలజీ 94, మేథమేటిక్స్, మైక్రోబయాలజి, ఫిజిక్స్ 90, కెమిస్ట్రీ 42 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టరు, మూడేళ్ల ఎల్ఎల్‌బీ తొలి సెమిస్టరు ఫలితాలను విడుదలచేశారు. శ్రీనివాసరావు, గంగయ్య, మమత పాల్గొన్నారు.

సర్దుబాటులో గందరగోళం

ఎంత చేసినా ఉపాధ్యాయుల కొరతే ● జూనియర్లకు ప్రాధాన్యత ● విద్యాశాఖ అధికారులపై ఉపాధ్యాయుల ఆగ్రహం



మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 11: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పని సర్దుబాటు చేపట్టింది. విద్యాశాఖాధికారుల నిర్వాకంతో సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా తయారైంది. దీంతో విద్యాశాఖాధికారులపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 110 ప్రభుత్వ పాఠశాలల్లో 14,320 మంది విద్యార్థులు, దాదాపు 525 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఆగస్టు 19న మండల, డివిజన్ స్థాయిలో పనిసర్దుబాటు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాలు, నేరున్న ఉపాధ్యాయుల మాటే చెల్లుబాటు కావడంతో కొందరు ఉపాధ్యాయులు అనుకున్న పాఠశాలలకు వెళ్లారు. పని సర్దుబాటు జరిగినా దొరసానిపల్లె జడ్పీ హైస్కూలులో ఇద్దరు, మరో జడ్పీ హైస్కూలులో ఒకరు, ఎస్వీజీ బాయిస్ హైస్కూలులో ముగ్గురు ఉపాధ్యాయుల కొరత ఉంది. మోడంపల్లె మున్సిపల్ ఉరూ పాఠశాలలో ఇద్దరు, హోమస్ పేట, శ్రీనివాసనగర్, చౌటపల్లె, మీనాపురం, రాజీవ్‌నగర్, రేగుళ్లపల్లె, తాళ్లమాపురం హరిజనవాడ, ఉప్పరపల్లె, బొజ్జవారిపల్లె, ఈశ్వర్‌రెడ్డినగర్, చెన్నంరాజుపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క ఉపాధ్యాయుల కొరత ఉండగా గోపవరం, ఖాదర్‌బాద్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఒక్కో పాఠశాలలో ముగ్గురు వంతున ఉపాధ్యాయుల కొరత ఉంది. మొత్తం మీద ఉన్నత పాఠశాలలో 6, ప్రాథమిక పాఠశాలలో 19 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యాశాఖాధికారులు సీనియర్ అధికారులను పక్కనబెట్టి జూనియర్లకు ప్రాధాన్యత ఇవ్వడంతో సీనియర్లు నష్టపోయారు. యూడైస్, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను పనిసర్దుబాటు చేయాల్సి ఉంది. అయితే కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల కోసం డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలలో నమోదు చేశారు. దీంతో ఆ పాఠశాలలకు అదనంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఫలితంగా మండలంలో 25 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. సర్దుబాటుతో ఉపాధ్యాయులకు శ్రమే తప్ప ఎటువంటి ఉపయోగం లేదని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. పదోన్నతులు ఇవ్వకుండా సర్దుబాటు చేయడం వలన పాఠశాలలకు కూడా ఉపయోగం లేదని పెదవి విరుస్తున్నారు.

అస్తవ్యస్తం



మండలంలో చేపట్టిన సర్దుబాటు అస్తవ్యస్తంగా మారింది. కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయులున్నా కొన్ని పాఠశాలలకు కేటాయించలేదు. సర్దుబాటుతో పాఠశాలలకు ఉపయోగంలేదు. సర్దుబాటుపై అధికారుల తప్పులను ప్రశ్నిస్తే ఆన్‌లైన్ పేరుతో తప్పించుకుంటున్నారు.

సుబ్బరాజు యాదవ్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: కడప నగరం ఉక్కాయపల్లె పంచాయతీలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలకు పదేళ్లకు అటానమస్ హోదా ఇచ్చినట్లు ఛైర్మన్ జి.శ్రీనివాసులు సమక్షంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ కళాశాల సిబ్బందికి తెలియజేశారు. కళాశాల ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఢిల్లీ కేంద్రంగా పనిచేసే యూజీసీ, ఎస్ఐటీఎస్‌లోని ఉన్నతమైన విద్యాప్రమాణాలను విద్యార్థులకు అ వసరమయ్యే అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు సాంకేతిక విద్య యూనివర్శిటీ గ్రాంటు కమిషన్ న్యూఢిల్లీ గుర్తించి అటానమస్ హోదా ఇచ్చినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమయ్యే అన్నిసదుపాయాలు సమకూర్చే ఛైర్మన్ విద్యార్థులను సాంకేతిక నైపుణ్యవంతులుగా మార్చడానికి పాటుపడే ఆయా విభాగాల అధిపతులు అధ్యాపకుల ద్వారా కళాశాలకు గతేడాది నాస్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని ఈ ఏడాది నుంచి రాబోయే పదేళ్లకు అటానమస్ హోదా వచ్చిందన్నారు.

కరెంటు షాక్ తగిలి ఎద్దు మృతి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 11: అప్పాయపల్లె పొలాల్లో బుధవారం కరెంటు షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. చదిపిరాళ్ల రైతు రఘురాం కాడెద్దుల ద్వారా కుటుంబాన్ని పోషించుకునేవాడు. తెల్లవారుజామున ఇసుక తోలేందుకు పాపాఘ్నినదిలోకి వెళ్లాడు. నది నుంచి ఇసుక తోలుతుండగా దారిలో నీళ్లున్న ప్రాంతంలోనే ట్రాన్స్‌ఫార్మరు ద్వారా భూమికి కరెంటు సరఫరా అవుతోంది అది గమనించని రైతు ఇసుక లోడ్ చేసుకుని వస్తుండగా నీటిలో దిగగానే షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది.

బైకు బోల్తా - ఇద్దరికి గాయాలు

ముద్దనూరు సెప్టెంబరు11: మునయ్యకోన వద్ద బుధవారం ఉదయం బైకు అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన ఇర్ఫాన్, ఇస్మాయిల్ ముద్దనూరుకు వస్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. వారిని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిపై దాడి - కేసు నమోదు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 11: మనస్పర్థలతో బీటెక్ విద్యార్థి ఊటుకూరు తరుణ్ కుమార్‌రెడ్డిపై దాడి జరిగింది. మైదుకూరు ఉప మండలాధ్యక్షుడు రఘురామిరెడ్డి ఇంటి వద్దకు జీవీ సత్రంకు చెందిన కదీర్, ఉప్పుకుంటపల్లెకు చెందిన శివ వెళ్లి తరుణ్‌పై దాడి చేశారు. తరుణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ సయ్యద్ హసం తెలిపారు.

బాలిక అప్పగింత

కడప (క్రైం), సెప్టెంబరు 11: కడప నగరం చలమారెడ్డిపల్లెకు చెందిన బాలిక అర్ధరాత్రి నుంచి కన్పించడంలేదు. దీంతో కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం అందించారు. రిమ్స్ ఎస్ఐ జయరాములు తన సిబ్బందితో బాలిక కోసం గాలించారు. గంటల వ్యవధిలోనే బాలికను గుర్తించి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి తగు జాగ్రత్తలు చెప్పి పంపించారు.

గండికోట లోగో డిజైన్,టాగ్ లైన్ రూపకల్పన పోటీలు

22 లోగా దరఖాస్తులు పంపాలి : కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు11: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని 27న గండికోట పర్యాటక కేంద్రంలో నిర్వహించే ఉత్సవాల లోగో డిజైన్,టాగ్ లైన్ రూపకల్పన పోటీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో గంగాధర్ గౌడ్, స్పెషల్ ఆఫీసరు సురేష్‌కుమార్ సంబంధిత అధికారులతో కలిసి గండికోట అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ 27న గండికోట ఉత్సవాలను జిల్లా యంత్రాంగం నిర్వహించనుందన్నారు. అందులో భాగంగా గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతిని ప్రతి బించేలా ప్రత్యేకమైన, సృజనాత్మకమైన లోగో, ట్యాగ్‌లైన్‌ను రూపొందించడం కోసం దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఉత్తమ లోగోకు రూ. 25 వేలు, ఆంగ్లంలో అత్యంత ఆకర్షణీయమైన టాగ్ లైన్‌కు రూ.15 వేలు నగదు బహుమతిని ప్రకటించామన్నారు. అభ్యర్థులు తమ పేరు, మొబైల్ నెంబరుతో ఎంట్రీలను ఈ మెయిల్ ఐడి విజిట్ గండికోట. జీ మెయిల్ డాట్ కమ్‌కు సెప్టెంబరు 22 వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపాలన్నారు. అదనపు సమాచారం కోసం ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, ఫేస్ బుక్‌లో విజిట్ గండికోట పేజీలను ఫాలో అవ్వాలన్నారు. పర్యాటక దినోత్సవాల్లో భాగంగా గండికోట పర్యటక కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని అభివృద్ధి కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. పర్యాటకం, వినోదం ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే వనరుగా ఉపయోగపడాలన్నారు. పోలీసు, రెవెన్యూ, టూరిజం శాఖల సమన్వయంతో పర్యాటకులకు సంతృప్తికర ఏర్పాట్లను సమకూర్చాలన్నారు. ఆర్కియాలజీ, మైన్స్ శాఖల ఆధ్వర్యంలో గండికోట జియోలజికల్ ప్రాశస్త్యాన్ని వివరించేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చిన్న పిల్లల వినోదం కోసం ప్లే జోన్ ఏర్పాటు చేయాలన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం

- అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శైలజ



విజేతలకు బహుమతులు అందిస్తున్న అడిషనల్ డాక్టర్ శైలజ, మార్ల ఓబుల్‌రెడ్డి తదితరులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11: అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అదనపు అధికారి డాక్టర్ శైలజ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు డైట్ కళాశాలలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సుకు వచ్చిన విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాప్తి మీద అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. క్విజ్ పోటీలు, మారథాన్ వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎయిడ్స్, సాధారణ ఆరోగ్యం, రుతుస్రావ చక్రము, ఆరోగ్యకర ఆహారము, స్వచ్ఛంద రక్తదానం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. డైట్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మాట్లాడారు. క్విజ్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన సంబేపల్లె జడ్పీహైస్కూల్ విద్యార్థులు రుక్సానా, రుక్సార్‌కు రూ.5 వేలు నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన పెద్దివీడు రెడ్డివారిపల్లె జడ్పీహైస్కూల్ విద్యార్థులు సుధారాణి, అశ్వితకు రూ.4 వేలు, తృతీయ స్థానం సాధించిన మాసాపేట జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఆయేషా, సాయిశ్రీలకు రూ.3 వేలు నగదు బహుమతి ప్రశంసా పత్రాలను అందించామన్నారు. జిల్లా విజేతలు 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఆఫ్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, జిల్లా రిసోర్స్ పర్సన్ అల్లావలి, ప్రాజెక్టు సిబ్బంది స్వాతి, సాధిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 11: పక్కాగృహాల నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ హౌసింగ్ శాఖ డీఈఈ మురళీక్రిష్ణ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు హౌసింగ్ శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట మండలాలకు గత ప్రభుత్వంలో మొత్తం 2616 పట్టాలు, ఉర్లగట్టుపోడులో 178 మందికి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అప్పటి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్ అధికారుల సమక్షంలో ఇళ్లు నిర్మించే మేస్త్రీలు, లబ్ధిదారులకు మధ్య ఒప్పందం కుదిర్చినట్లు తెలిపారు. మేస్త్రీలు శ్లాబు పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వం వారు మంజూరు చేసిన బిల్లులు లబ్ధిదారుల అకౌంటులో పడుతుందన్నారు. పడిన బిల్లులను లబ్ధిదారులు మేస్త్రీలకు ఇవ్వాలనే ఒప్పందమన్నారు. మేస్త్రీలు పని పూర్తి చేసిన తర్వాత కొందరు లబ్ధిదారులు మేస్త్రీలకు డబ్బు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం నుంచి డబ్బు లబ్ధిదారులకు పడ్డాయని, పెండింగ్‌లో లేవన్నారు. మేస్త్రీలకు సుమారు లబ్ధిదారుల నుంచి రూ. 10 లక్షలు డబ్బులు రావాల్సి ఉందన్నారు.

కారు చోరీ కేసులో నిందితులు అరెస్టు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 11: కారు దొంగతనం కేసులో నిందితులు రామ్‌నాథరెడ్డి, హరిక్రిష్ణారెడ్డిని అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. వై.కోడూరు గ్రామంలో సిరిగిరెడ్డి శివారెడ్డి కల్లంలో కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లింగాలదినెపల్లెలో సెప్టెంబరు 7న కారు చోరీ జరిగిందని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మైదుకూరు రూరల్ సీఐ పర్యవేక్షణలో బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టగా ఎర్రగుంట్ల మండలం వై.కోడూరులో శివారెడ్డి కల్లందొడ్డిలో దాచిన కారును బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి ఉయోగించిన పల్సర్ బైకు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ విలేకరులకు తెలిపారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీ లెక్కింపు

కడప (కల్చరల్) సెప్టెంబరు 11: రాజరాజేశ్వరీ దేవి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. మార్చి 27వ తేదీ నుంచి అమ్మవారికి కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ. 1,25,272గా నిర్ధారించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కడప ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్, అర్చకులు పాల్గొన్నారు.

చెర్లోపల్లెవాసి కువైత్‌లో మృతి



అట్లూరు, సెప్టెంబరు 11: చెర్లోపల్లె వాసి జమ్మన సుబ్బ నరసారెడ్డి (50) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మరణించినట్లు అతని బంధువులు తెలిపారు. సుబ్బనరసారెడ్డి కువైత్‌లో బిల్డింగు పనిచేసేవాడని, మంగళవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతనికి భార్య యశోదమ్మ ఒక కొడుకు, కూతురు ఉన్నారు. సుబ్బ నరసారెడ్డి మృతదేహాన్ని సొంతూరుకు తరలిస్తున్నట్లు అతని బంధువులు తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 11: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం మైలవరం నుంచి పెన్నాకు 2000 క్యూసెక్కులు, ఉత్తర కాల్వకు 120 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 120 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. మైలవరం జలాశయ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 4.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటించారు.

నర్సు శిక్షకులకు జపాన్ భాషపై శిక్షణ

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 11: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో బీఎస్సీ నర్సింగ్ చేసిన విద్యార్థులకు జపనీస్ భాషపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరిక్రిష్ణ తెలిపారు. ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిలో జపనీస్ బాష నేర్పించి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగం పొందేందుకు దరఖాస్తులు పంపనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం అర్హులకు జపాన్ దేశంలో నెలకి రూ.1,00,000 నుంచి 1,40,000 వరకు జీతంతో ఉద్యోగం పొందే అవకాశం వుంటుందన్నారు. వివరాల కోసం 7981972887ను సంప్రదించాల్సి వుంటుందని ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి స్వాధీనం - ఒకరు అరెస్ట్

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 11: జేఆర్ రవీంద్ర నగర్‌లో 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సయ్యద్ హసం విలేకరులకు తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కొరిగం శ్రీను తన పాత ఇంట్లో దాచిన గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రాయచోటిలో సినిమా షూటింగ్


షూటింగ్‌లోని ఒక సన్నివేశం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11: రాయలసీమ ఫ్యాక్షన్ బ్యాక్ డ్రాప్ నేపథ్యంలో దేవగుడి సినిమా షూటింగ్‌ను రాయచోటి వాసి, నిర్మాత, డైరెక్టర్ బెల్లం రామక్రిష్ణారెడ్డి రాయచోటి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ స్వరకర్త గాయకుడు, నటుడు రఘు కుంచె మ్యూజిక్ అందిస్తున్నారు. మరికొందరు ఆర్టిస్టులతో పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు వండాడి వెంకటేశ్వర్లు ఇంటితో పాటు అమరావతి హాస్పిటల్, రాయుడుకాలనీ తదితర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సినీ హీరో అభినవ్, హీరోయిన్ అనుశ్రీ, ఆర్టిస్టులు రఘు కుంచె, రాజాశ్రీ తదితరులపై కొన్ని సీన్లు పూర్తి చేశారు. గత రెండు, మూడు రోజులుగా షూటింగ్ జరుగుతుండడంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది.

రాత్రింబవళ్లు వరద బాధితుల మధ్యే సీఎం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11: రాత్రింబవళ్లు వరద బాధితుల మధ్య చంద్రబాబు గడుపుతుంటే.. వైసీపీ అధినేత జగన్‌రెడ్డి విలాసవంతమైన ప్యాలెస్‌లో ఉంటూ బురద రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ బెంగుళూరు ప్యాలెస్‌లో ఉంటూ... విజయవాడలో వరద బాధితుల మధ్య మోకాళ్ల లోతులో పర్యటిస్తూ బాధితులకు సహాయ, సహకారాలు అందిస్తున్న చంద్రబాబును విమర్శించటం సిగ్గుచేటన్నారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడానికి కారణం జగనేనని, ఇసుక మాఫియా లబ్ధి కోసమే 33 మంది చనిపోవడానికి కారకుడయ్యాడని ఆరోపించారు. అన్నమయ్య వరదల్లో గిరిప్రసాద్ అనే పూజారి కుటుంబానికి చెందిన 9 మంది చనిపోవడానికి జగన్ అసమర్థతే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, అంజద్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీడు పొలాలను సాగులోకి తేవాలి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11: బీడు పొలాలను సాగులోకి తెచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామం బాలిరెడ్డిగారిపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు ఉపయోగపడే బీడు పొలాలను సాగులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. రైతులు వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు దివాకర్, రమేశ్‌రాజు, ఆర్‌ఎస్‌కే అధికారి కిరణ్‌కుమార్‌రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వంశీ, యశోద పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరేనా..!

- గత ప్రభుత్వంలో రూ.3 కోట్లు నీటిపాలు
- వర్షాకాలంలోనూ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా
- శాశ్వత పరిష్కారానికి రూ.31.62 కోట్లు మంజూరు


జె.వడ్డెపల్లెలో అరకొరగా వస్తున్న నీటికోసం బోరువద్ద వేచి ఉన్న మహిళలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 11: గత ఐదేళ్లుగా మండలంలో సకాలంలో వర్షాలు కురవలేదు. బోర్లు ఎండిపోయి తాగడానికి గుక్కెడు నీరు దొరకక ప్రజలు నానాకష్టాలు పడుతున్నారు. వర్షాకాలంలోనూ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో సర్పంచులకు ఎలాంటి నిధులు లేక చెడిపోయిన బోర్ల మరమ్మతులకూ నానా తిప్పలుపడ్డారు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం ఒక్క రూపాయి పంచాయతీలకు ఇవ్వకపోవడంతో కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం జల్ జీవన్ మిషన్ పథకం కింద మండలానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే అరకొర ట్యాంకర్లు, అక్కడక్కడ మంచినీటి పథకం బోర్లు వేశామని చెప్పి ఆ నిధులన్నీ గ్రామనాయకులు, సర్పంచులు ఖర్చులు చూపించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ నిధులు ఏటిపాలైనట్లయింది.

అయితే మండలంలో తాగునీటి సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఏ గ్రామంలో బోరువేసి ప్రజలకు చుక్కనీరు అందించిన పాపాన పోలేదు. కాగా మండలంలో 46 కొత్త బోర్లు వేశామని, అన్నీ ఫెయిల్యూర్ అయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాకి లెక్కలు చెబుతున్నారు. మండలంలో పందిళ్లపల్లె గ్రామ పరిధిలోని జే.వడ్డెపల్లె, బుర్జుపల్లె గ్రామాల్లో 120 కుటుంబాలు ఉండగా.. 3 ఏళ్లగా ఈ గ్రామంలో తాగునీటి కష్టాలు తీరలేదు. ఎన్నికల ముందు నేతలు వారి సొంత నిధులతో బోరు వేయించినా నీరుపడలేదు. మొత్తం 6 బోర్లు వేసినా చుక్క రాలేదు. ఓ రైతు వ్యవసాయ మోటారు నుంచి నీరు అందిస్తున్నా... ఆ నీరు కొన్ని కుటుంబాలకే సరిపోతున్నాయని మిగిలిన కుటుంబాల వారు ఆవేదన చెందుతున్నారు.

ఇక పాలెంగొల్లపల్లె పంచాయతీలోని బుర్జుపల్లె, మామిడిగారిపల్లె, చిన్నపోతులపల్లె, నడింపల్లె, గ్రామాల్లో తాగునీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దప్పేపల్లె పంచాయతీలోని గొల్లపల్లె, చిన్ననాగిరెడ్డిగారిపల్లె, రెడ్డివారిపల్లె, ఈ రెండు పల్లెల్లో మంచినీటి పథకం బోర్లు ఎండిపోయి వ్యవసాయ మోటార్లను ఆశ్రయిస్తున్నారు. కుర్నూతల అగ్రహారం పంచాయతీలోని వాయిల్‌రాజుగారిపల్లె, ఎగువ వడ్డెపల్లె, దిగువ వడ్డెపల్లె గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లె, అనంతపురం హరిజనవాడ గ్రామాల్లో పూర్తిగా తాగునీటితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం ప్రతి గ్రామానికి ఒక పూట మాత్రమే ట్యాంకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ఉదయం వచ్చేనీరు అప్పటికే సరిపోతున్నాయని, పశువుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని చెబుతున్నారు. ఈ మధ్య కురుస్తున్న తేలికపాటి వర్షాలకు పదును కూడా లేదు. ఇదిలా ఉండగా శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.31.62 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రతి గ్రామంలోనూ మంచినీటి బోరువేసి పెద్ద ఓవర్ ట్యాంక్ ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా నీరు అందించాలి. అయితే వైసీపీ ప్రభుత్వంలో టెండర్ తమకే దక్కాలని ఒకరిపై ఒకరు పోటీకి దిగడంతో ఆ నిధులు అలాగే ఉండిపోయాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తాగునీటి కోసం ఉన్న నిధులకు టెండర్ వేసి ప్రతి గ్రామానికి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కష్టాలు తప్పడం లేదు

- వెంకటసుబ్బమ్మ, జె.వడ్డెపల్లె



ఉన్న బోర్లల్లో నీరు ఎండిపోయి రెండు సంవత్సరాల నుంచి నానా కష్టాలు పడుతున్నాం. ఎన్నికల ముందు నేతలు బోరు వేసినా నీరు పడలేదు. ట్యాంకర్ల ద్వారా కొన్ని రోజులు తోలారు. ప్రస్తుతం వ్యవసాయ బోరు నుంచి నీరు అందిస్తున్నారు. ఆ నీరు రెండు వీధులకు మాత్రమే సరిపోతున్నాయి. మిగిలిన వారు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపి పుణ్యం కట్టుకోండయ్యా.

త్వరలో టెండర్లు పిలుస్తాం

- కిశోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

మండలానికి రూ.31.62 కోట్లు మంజూరైంది. అందుకు టెండర్లు పిలవాలి. గతంలో ఉన్న 90 లక్షల నిధులను బోర్లకు ఉపయోగించాము. అయినా ఎక్కడా నీరు పడలేదు. ప్రస్తుతం 10 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నాం. త్వరలో శాశ్వత పరిష్కారానికి టెండర్లు పిలిచి కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి నీరు అందిస్తాం.


వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న వృద్ధురాలు


దిన్నెపాడు వడ్డెపల్లెలో ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న దృశ్యం


వ్యవసాయ బోర్ల వద్ద ట్యాంకర్లకు నీరు నింపుకుంటున్న దృశ్యం


జె.వడ్డెపల్లెలో కొత్తబోరు వేసినా నీరు పడని దృశ్యం

గంగమ్మ ఒడికి గణనాథుడు




రాయచోటిలో అన్నదానం చేస్తున్న ప్రసాద్‌బాబు, నందలూరులో స్వామి సన్నిధిలో మేడా విజయశేఖర్‌రెడ్డి, చిన్నమండెంలో ప్రత్యేక పూజల్లో మంత్రి సతీమణి

● పలుచోట్ల అన్నదానం, ఊరేగింపు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11: చవితి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం పలుచోట్ల నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం, అనంతరం స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు.

రాయచోటి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణనాథునికి ప్రత్యేక అభిషేకాలు, గరిక పూజలతో పాటు ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని రెడ్డీస్‌కాలనీలో గల రామాలయం పక్కన ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అలాగే పట్టణ పరిధిలోని కృష్ణాపురం, చిత్తూరు రోడ్డు, రాయుడుకాలనీ, యండపల్లి, శిబ్యాల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా హరినాథవీధి, పాత పోస్టాఫీసు వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

రాజంపేటటౌన్: పట్టణ నలుమూలల్లో గణనాథుల నిమజ్జనోత్సవాలను, అన్నదాన కార్యక్రమాలను బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి అతి సమీపంలో ఉన్న అత్తిరాల, పోలిచెరువు, తాళ్లపాక, సిద్దవటం పెన్నానది ప్రాంతాల్లో నీటిగుంటల్లో స్వామివారిని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ఎస్.సుధాకర్ పర్యవేక్షణలో సీఐలు యల్లంరాజు, రమణ, రామాంజనేయులు నేతృత్వంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సుండుపల్లె: అన్నదానం గొప్ప పుణ్యకార్యమని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని రాయవరం కస్పాలో వినాయకుని నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములయ్య, శివకుమార్‌నాయుడు, యర్రంరెడ్డి, దామోదర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం, గువ్వలచెరువు, గోపగుడిపల్లి, రామాపురం తదితర గ్రామాల్లో బుధవారం వినాయక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి నిమజ్జనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, ఆంజనేయులు, రాజశేఖర్, రాజా, లోకేశ్, శ్రవణ్‌కుమార్, గంగయ్య, మహిళలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మండల పరిధిలోని డి.రామాపురం, కస్తూరిరాజుగారిపల్లె, మద్దిరేవుల, దీయలవాండ్లపల్లె, పిచ్చికుంటపల్లి, హరిజనవాడ, పాలెం గొల్లపల్లెలో దాదాపుగా 30 వినాయక విగ్రహాలు సమీపంలోని దొర్రిచెరువులో నిమజ్జనం చేశారు. మండలంలోని వినాయక విగ్రహాల వద్ద పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్ పోగ వెంకటరమణ, భువనబోయిన లక్ష్మీనరసయ్య, టంగుటూరు ఎంపీటీసీ పెంచలయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లె, గొబ్బూరువారిపల్లె తదితర గ్రామాల్లో యువకుల ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం కార్యక్రమం జరిగింది.

పెనగలూరు: బుధవారం ఓబిలి, అత్తిగారిపల్లె, పెనగలూరు, ఎగువ హరిజనవాడ, దిగువ హరిజనవాడ, ఇండ్లూరు హరిజనవాడల్లో ఆరే భాగ్యమ్మ కుటుంబ సభ్యులు 24 కిలోల లడ్డూ ప్రసాదాన్ని రూ.75,500కు వేలంలో దక్కించుకున్నారు. అలాగే అనంతంపల్లెలో 10 కిలోల లడ్డూ ప్రసాదాన్ని తుమ్మల సురేష్‌నాయుడు కుటుంబ సభ్యులు రూ.37 వేలకు దక్కించుకున్నారు.

చిన్నమండెం: చవితి ఉత్సవాల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ పాల్గొన్నారు. బోనమల పంచాయతీ నాగూరువాండ్లపల్లె, హరిజనవాడ, పడమటికోన గ్రామపంచాయతీ వడ్డెపల్లెలో హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ స్వామివారి కృపతో వర్షాలు బాగా పడాలని కోరారు.

వినాయకుని లడ్డూ రూ.1.40 లక్షలు


లడ్డూను వేలంపాటలో దక్కించుకున్న లక్ష్మీకర్‌రెడ్డి

రాజంపేట, సెప్టెంబరు 11: రాజంపేట పట్టణం సాయినగర్‌లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన లడ్డూ రూ.1.40 లక్షలు పలికింది. బుధవారం వినాయకుని లడ్డూను వేలం వేయగా సాయినగర్‌కు చెందిన పోలి లక్ష్మీకర్‌రెడ్డి స్వామివారి లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నారు. వినాయక కమిటీ సభ్యులు భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలను ఏర్పాటు చేశారు. అనంతరం మధ్యాహ్నం మేళతాళాలతో వినాయక ప్రతిమను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. దారి పొడవునా భక్తులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి వెళ్లారు.

నందలూరులో రూ.1.05 లక్షలు...

నందలూరు, సెప్టెంబరు 11: మండలంలోని నందలూరు గ్రామ పంచాయతి నీలిపల్లె గ్రామంలో వినాయకస్వామి లడ్డూ వేలంపాటలో నరసింహులు అత్యధికంగా రూ.1.05 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాద్, దాసరి కాటయ్య, ఉప్పుశెట్టి కొండయ్య, ఉప్పుశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో రూ.60 వేలు...


సుండుపల్లె, సెప్టెంబరు 11: మండల కేంద్రానికి సమీపంలోని అగ్రహారం వినాయకుని మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంపాటలో కోటకొండ రోశయ్య రూ.60 వేలకు దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. అలాగే కలశం, టెంకాయను వెంకట్రమణ రూ.23,500కు, రూపాయి బిళ్లను వెంకటేశ్ రూ.18 వేలకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. అలాగే ఏటిగడ్డ రాచపల్లిలో వేలంపాటలో అద్దేపల్లి నాగరాజు రూ.32 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ పాల్గొన్నారు.

ఎర్రబల్లెలో భారీ అన్నదానం


అన్నప్రసాదంలో పాల్గొన్న వందలాది మంది భక్తులు

రాజంపేట, సెప్టెంబరు 11: రాజంపేట పట్టణం సుదర్శన్ థియేటర్ సమీపంలోని ఎర్రబల్లె మన్నూరు వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.పెద్ద బ్రహ్మయ్య కుమారులచే భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆయన కుమారులు ఎస్.ప్రసాద్, నాగరాజ, నాగేంద్ర, రాఘవ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎర్రబల్లె, మన్నూరు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది ఈ అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తమ తండ్రి పేరిట ఎర్రబల్లెలో ఉత్సవాల సందర్భంగా భక్తులందరికి అన్న ప్రసాదం అందచేయడం ఆనందదాయకమన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

చిట్వేలి, సెప్టెంబరు 11: గ్రామాల్లో ప్రజలకు మౌలిక సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సీసీ రోడ్లు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో మండలంలో కరెంట్, సచివాలయాలు, తాగునీరు, ఉపాధి సమస్యలపై ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సి.కందులవారిపల్లె పంచాయతీ ఉపాధిలో పెద్దమొత్తంలో అవినీతి జరిగిందని, మాజీ మండలాధ్యక్షుడు కాకర్ల సుబ్బరాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు పలు సమస్యలు తెలియజేశారు.

జీవో 85కు వ్యతిరేకంగా వైద్యుల నిరసన

గాలివీడు, సెప్టెంబరు 11: జీవో నెంబర్ 85ను వ్యతిరేకిస్తూ బుధవారం నూలివీడు, గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు స్రవంతిరెడ్డి, శంకర్‌నాయక్, రాధమాధవి, రఫీలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడవద్దు : సీఐ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 11: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడవద్దని సీఐ హేమసుందర్‌రావు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలను ఉపయోగించరాదని, మంచిగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం.భాస్కర్‌రెడ్డి, యం.శ్రీలత మాట్లాడుతూ విద్య అవశ్యకత ను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ జి.దయానందం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఆవరణంలో క్లీన్ అండ్ గ్రీన్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 11: పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఉంగరాల నాగేంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛందంగా క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఆవరణంలో ఉన్న చెత్తచెదారాలు, పిచ్చి మొక్కలు తొలగించారు. తన సొంత నిధులతో క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

పొత్తపిలో వైద్య పరీక్షలు

నందలూరు, సెప్టెంబరు 11: మండలంలోని పొత్తపి గ్రామంలో వింత వ్యాధితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశువులకు బుధవారం వైద్యసేవలు అందించినట్లు పశువైద్యాధికారిణి అశ్విని పేర్కొన్నారు. జూన్ నెలలో ఇక్కడి గేదెలకు గొంతువాపు రావడంతో పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

పోలీసులకు తలనొప్పిగా

సత్యవేడు ఎమ్మెల్యే కేసు



- అటు దళిత ఎమ్మెల్యే.... ఇటు టీడీపీ మహిళా నేత
- హోటల్‌కు రాకపోకలపై ప్రాథమిక ఆధారాలు లభ్యం
- ఫోన్ కాల్ డేటా సేకరణపై దృష్టి -అనివార్యంగా కుట్ర కోణంపైనా దర్యాప్తు

తిరుపతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటు చూస్తే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నది అధికార పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యే.. ఇటు చూస్తే ఆరోపణలు చేసింది అదే అధికార పార్టీకి చెందిన మహిళా నేత... ఆరోపణలు చేస్తున్నది, ఎదుర్కొంటున్నది ఇరువురూ సమాజంలో అణచివేత ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారే... ఎలా చూసినా సున్నిత వ్యవహారం కావడంతో సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదైన కేసు పోలీసు వర్గాలకు తలనొప్పిగా మారింది. దీంతో నిష్పాక్షిక దర్యాప్తుతోనే ఒత్తిడులను అధిగమించాలని, తద్వారా ప్రభుత్వాన్ని ఎవరూ తప్పుపట్టే అవకాశం లేకుండా చేయాలని జిల్లా పోలీసు అధికారులు భావిస్తున్నారు. గత గురువారం అర్ధరాత్రి కేవీబీపురం మండలానికి చెందిన ఓ తెలుగు మహిళ నాయకురాలు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన మహిళే ఈ కేసు విచారణకు సహకరించకపోతుండడం పోలీసు అధికారులకు సమస్యగా మారుతోంది. మరోవైపు ఫిర్యాది, నిందితుడు అధికార పార్టీకి చెందిన వారే కావడంతో కేసు దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందా లేదా అన్నది ఇపుడు అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజానీకంలోనూ చర్చనీయాంశంగా మారుతోంది.

మొబైల్ ఫోన్ కాల్ డేటాయే కీలకం

కేసును ఎంతోకొంత పరిష్కరించగలిగిన ఆధారాల్లో కీలకమైంది మొబైల్ ఫోన్ కాల్ డేటా. దీంతో పోలీసులు ఎమ్మెల్యే ఫోన్, బాధిత మహిళ వినియోగిస్తున్న రెండు ఫోన్లు, ఆమె భర్త ఫోన్లకు సంబంధించిన కాల్ డేటాపై దృష్టి సారించారు. బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొన్న జూలై 6, 17 తేదీలతో పాటు ఆగస్టు 10వ తేదీ... ఈ మూడు రోజుల్లో వీరి ఫోన్ల నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? ఎవరెవరి నుంచీ కాల్స్ వచ్చాయి? ఎమ్మెల్యే, బాధిత మహిళల్లో ఎవరు ఎన్ని సార్లు ఎదుటి వారికి కాల్ చేశారు? అనే వివరాలు సేకరించే పనిలో పడ్డారు. అదే విధంగా ఆయా తేదీలకు అటూఇటూ పది రోజుల కాల్ డేటా కూడా సేకరిస్తున్నారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు, ఫిర్యాదు వెనుక కుట్ర ఏమైనా వుందా అన్న కోణంలో కూడా దర్యాప్తు అనివార్యం కానుంది. అందుకే బాధిత మహిళకు, ఆమె భర్తకు ఘటన జరిగిన మూడు రోజులకు ముందు వెనుక రోజుల్లో ఎవరెవరి కాల్స్ వచ్చాయి? వీరి నుంచీ ఎవరెవరికి కాల్స్ వెళ్ళాయి? అన్నది కూడా విశ్లేషించనున్నారు.

సీసీ పుటేజీల సేకరణ

తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు ఎమ్మెల్యే పిలుపుపై మూడు సార్లు వెళ్ళినట్టు బాధిత మహిళ ఫిర్యాదులో తెలిపిన మేరకు ఆ హోటల్‌లో సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు సేకరించారు. అయితే హోటల్‌లో సీసీ కెమెరాలు రికార్డు చేసే పుటేజీలు స్టోర్ అయ్యే హార్డు డిస్కు నుంచీ సంబంధిత రోజువారీ డేటా నెల రోజుల పాటు మాత్రమే వుంటుందని, అటు తర్వాత ఆటోమేటిగ్గా ఎరేజ్ అయ్యేలా సెట్టింగ్స్ పెట్టడంతో జూలై నెల 6, 17 తేదీల పుటేజీలు లభ్యం కాలేదని తెలిసింది. ఆగస్టు 10వ తేదీ పుటేజీలు మాత్రం దొరికాయని చెబుతున్నారు. అందులో ముందుగా ఎమ్మెల్యే ఆదిమూలం హోటల్‌కు రావడం, ఆ తర్వాత బాధిత మహిళ రావడం రికార్డయిందని సమాచారం. బాధిత మహిళ హోటల్ లోపలికి వెళ్ళాక గది వద్దకు, రిసెప్షన్ వద్దకు రెండు సార్లు అటూ ఇటూ తిరిగిన దృశ్యాలు రికార్డయినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సీసీ కెమెరాల హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు దాని విశ్లేషణకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు సమాచారం.

సీసీ కెమెరా పుటేజీలతో ప్రయోజనం పరిమితమేనా?

దర్యాప్తులో సాంకేతికంగా ఒక దశ వరకూ మాత్రమే ఆధారాలు సేకరించగలమని, అంతకు మించి కేసులోని వ్యక్తుల ఉద్దేశాల విషయంలో తాము చేయగలిగిందేమీ లేదన్నది పోలీసు అధికారుల భావనగా తెలుస్తోంది. సీసీ కెమెరా పుటేజీలతో దర్యాప్తులో పరిమితంగానే ప్రయోజనం వుంటుంది తప్ప కేసు పరిష్కారానికి పెద్దగా ఉపయోగపడదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. బాధిత మహిళను ఎమ్మెల్యే బెదిరించిన వీడియోలు కానీ లేదా ఆడియో రికార్డులు కానీ ఇప్పటి వరకూ బాధిత మహిళ పోలీసులకు ఆధారాలు ఇవ్వలేదని సమాచారం. అలాగే అసభ్యకరంగా లేదా బెదిరింపులతో కూడిన వాట్సాప్ మెసేజీలు కానీ ఎస్ఎంఎస్‌లు కానీ పెట్టినట్టు కూడా ఆధారాలు అందజేయలేదు.అలాంటి ఆధారాలు వున్నాయో లేదో కూడా బాధిత మహిళ పోలీసులకు వెల్లడించలేదు. అలాంటివి వుంటే ఆరోపణలకు అదనపు బలం కలిగించడంతో పాటు నేర నిరూపణ సులువయ్యేదని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా ఎమ్మెల్యే, బాధిత మహిళ ఆగస్టు 10న హోటల్‌కు వచ్చినట్టు ఆధారాలు లభించినా నేరాన్ని నిరూపించలేవన్నది వారి భావనగా వుంది. బాధిత మహిళ తనే రికార్డు చేసినట్టుగా చెబుతున్న వీడియోలో ఎమ్మెల్యే బెదిరించడం లేదా దౌర్జన్యంగా వ్యవహరించడం, అత్యాచారం చేసినట్టుగా దృశ్యాలు వుంటే దర్యాప్తు ఒక కొలిక్కి చేరినట్టే. అయితే అలాంటి దృశ్యాలు అందులో వున్నాయో లేదో దర్యాప్తులో తేలాల్సి వుంది. కాగా హోటల్‌లో ఆ మూడు తేదీల్లో గదులు ఎవరు బుక్ చేశారు? ఎవరి పేరిట బుక్ చేశారు? అన్నది కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఘటన జరిగినట్టు చెబుతున్న తిరుపతి భీమాస్ ప్యారడైజ్ హోటల్ సిబ్బంది సాక్ష్యం కూడా కీలకం కానుంది. పోలీసు విచారణలో వారు వెల్లడించే అంశాలు దర్యాప్తుకు ఉపకరించే అవకాశముంది. బాధిత మహిళ చెబుతున్న తేదీల్లో గదుల్లోకి ముందుగా ఎవరు వెళ్ళారు? ఆయా సందర్భాల్లో బాధిత మహిళ తీరు ఎలా కనిపించింది? గదుల్లో పరిస్థితి అసాధారణంగా అనిపించింది ఏదైనా వుందా? అన్న సమాచారం రిసెప్షన్ సిబ్బంది, రూమ్ సర్వీస్ సిబ్బంది నుంచీ పోలీసులు సేకరించాల్సి వుంది.

ఎమ్మెల్యేని విచారించేది ఎపుడు?

గుండె సంబంధ సమస్యలతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన ఎమ్మెల్యే ఆదిమూలం ఎపుడు డిశ్చార్జి అవుతారో తెలియని పరిస్థితి. ఆస్పత్రి నుంచీ డిశ్చార్జి అయితే తప్ప పోలీసులు ఆయన్ను ప్రశ్నించడం వీలు కాదు. అప్పుడు కూడా వైద్యుల సూచనలు కీలకం కానున్నాయి. గుండె సంబంధ సమస్యలు వున్నప్పుడు ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వేయవద్దని వైద్యులు ఓ గడువు వరకూ సూచించే అవకాశమున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో ఏమి జరిగితే అది ఏ మలుపు తీసుకుంటుందోనని ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోందని దర్యాప్తు అధికారులు వాపోతున్నారు. ఇప్పటికే ఆదిమూలానికి మద్దతుగా టీడీపీలోనూ,వెలుపలా కూడా దళిత వర్గాలు ఆందోళన మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఆయనను పోలీసులు అరెస్టు చేయాలన్నా స్పీకరు అనుమతి తీసుకోవాల్సి వుంటుందని సమాచారం.అలాగని విచారణను సాగదీయడానికి కూడా వీల్లేని పరిస్థితి. అధికార పార్టీకే చెందిన మహిళా నేత తనపై లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదు కావడంతో ఆ కోణంలోనూ దీన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితి లేదు. మరోవైపు ప్రభుత్వ, అధికార పార్టీ ప్రతిష్టలతో ముడిపడిన వ్యవహారం. ఈ కారణాలతో సాధ్యమైనంత త్వరగా విచారణ ముగించి వాస్తవాలను బయటపెట్టి తాము ఒత్తిడి నుంచీ బయటపడాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

వైద్య పరీక్షలకు, విచారణకు సహకరించని ఫిర్యాది

ప్రభుత్వ ప్రతిష్టతో ముడిపడిన అంశం కావడంతో తిరుపతి పోలీసులు సత్యవేడు ఎమ్మెల్యేపై నమోదు చేసిన కేసులో దర్యాప్తును వేగంగా మొదలుపెట్టారు. గత గురువారం అర్ధరాత్రి కేసు నమోదు కాగానే శుక్రవారం ఉదయాన్నే బాధితురాలిని వైద్య పరీక్షల కోసం రుయాస్పత్రికి తరలించారు. అయితే ఆమె వైద్య పరీక్షలకు అంగీకరించకపోవడంతో లిఖితపూర్వకంగా రాయించుకుని పంపివేశారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. చట్టప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాల్సి వున్నందున పోలీసులు బాధితురాలి వెంటబడుతున్నారు. ఆ క్రమంలో సోమవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళ వైద్య పరీక్షలు అవసరం లేదని మొండికేసినట్టు సమాచారం. తనను విచారించడం మాని ముందు ఎమ్మెల్యేని అరెస్టు చేసి విచారించాలంటూ ఆమె డిమాండ్ చేసినట్టు తెలిసింది. దీంతో మరోసారి ఆమెతో ఆ మేరకు స్టేట్‌మెంట్ రాయించుకుని పంపించేసినట్టు పోలీసులు చెబుతున్నారు. వాస్తవానికి వైద్యపరంగా చూస్తే ఈ పరీక్షలతో పెద్దగా తేలేది కూడా ఏమీ వుండదని అటు పోలీసులు, ఇటు వైద్యులు కూడా భావిస్తున్నారు. ఎందుకంటే అత్యాచారం జరిగిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహిస్తే పలు ఆధారాలు లభ్యమవుతాయి. దుస్తులపై వీర్యపు ఆనవాళ్ళు, బాధితురాలి దేహంపై ఏవైనా గాయాలు వంటివి వుంటే ఆ మేరకు బలమైన ఆధారాలు లభించేవి. సంబంధిత హోటల్ గదిలోని బెడ్డు, బెడ్ షీట్, టవల్ వంటివి కూడా సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాల్సి వుండేది. వాటి ద్వారా కూడా కొన్ని ఆధారాలు దొరికేవి. గత నెల 10వ తేదీన జరిగిన ఘటనపై పాతిక రోజుల తర్వాత ఫిర్యాదు చేయడం వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. బాధిత మహిళ వైద్య పరీక్షలకు ఎందుకు నిరాకరిస్తున్నారన్నది పోలీసులకు అంతుబట్టడం లేదు.

సత్యవేడులో రాజకీయ నిశ్శబ్దం

ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం, ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయడం వంటి సంచలనాత్మక ఘటనలు జరిగినప్పటికీ నియోజకవర్గంలో రాజకీయంగా మాత్రం నిశ్శబ్దకర వాతావరణమే కనిపిస్తోంది. నియోజకవర్గ టీడీపీలో సైతం దళిత వర్గాలు మినహా మిగిలిన వర్గాలు ఎమ్మెల్యేకు మద్దతుగా ముందుకు రావడంలేదు. అదే సమయంలో ఆయనకు వ్యతిరేకంగానూ ఎలాంటి కార్యక్రమాలూ జరగకపోవడం గమనార్హం. ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, చివరికి విపక్షమైన వైసీపీ వర్గాలు సైతం ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఆందోళనలకు దిగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కాగా బాధిత మహిళకు కూడా ఎవరూ మద్దతుగా నిలవకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ నేపథ్యంలో తనపై లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలని కోరుతూ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు.తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు శోధించకుండా పోలీసులు నేరుగా కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్న ఆయన ఈ మొత్తం ఘటన ఓ హనీ ట్రాప్ అని తెలిపారు.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డేకు 30 ఫిర్యాదులు

చిత్తూరు రూరల్, సెప్టెంబర్ 11: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డేకు 30 ఫిర్యాదులు వచ్చినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. అప్పటికప్పుడే 25 పరిష్కారమైనట్లు చెప్పారు. మిగిలిన ఐదింటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. తిరుపతి టౌన్‌లో 3, పుత్తూరు 17, చిత్తూరు ఆపరేషన్ 4, చిత్తూరు రూరల్ 1, మదనపల్లి 1, పుంగనూరు 5 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. గీవెన్స్ డేపై ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్తు శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్ డేను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీ.ఎర్రేపల్లి ఎంపీటీసీ రాజీనామా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 11 : ఐరాల మండలం పీ.ఎర్రేపల్లి ఎంపీటీసీ పీ.ప్రభాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు జడ్పీ సీఈవో గ్లోరియాకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాజీనామాను ఆమోదిస్తూ బుధవారం ఆమె ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీ ల్యాడ్స్ పనులను త్వరగా పూర్తి చేయండి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 11: ఎంపీ ల్యాడ్స్ కింద గత ఐదేళ్లలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎంపీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాజీ ఎంపీ రెడ్డెప్పకు సంబంధించి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.9 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్‌షెల్టర్లు, కమ్యూనిటీ హాల్స్ వంటి 172 పనులు మంజూరయ్యాయని తెలిపారు. పూర్తిచేసిన పనుల బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రస్తుత ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు చెందిన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.1.69 కోట్లతో 37 పనులు మంజూరు చేశారని, త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు.

రైతు దగ్గర లంచమా?

- సిగ్గు లేదా అంటూ సర్వేయర్‌పై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే

పెనుమూరు, సెప్టెంబరు 11: రైతు దగ్గర డబ్బులు తీసుకుని తిప్పించుకునేందుకు నీకు సిగ్గులేదూ' అంటూ మండల సర్వేయర్ శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే థామస్ విరుచుకుపడ్డారు. తన వద్ద సర్వేయర్ రూ.7వేలు లంచం తీసుకుని పని మాత్రం చేయలేదని పెనుమూరు మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకి కేసీపల్లి పంచాయతీ బొంతివంక దళితవాడకు చెందిన రైతు బోడెబ్బ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సర్వేయర్‌ను పిలిచి 'ఒకవైపు జీతం తీసుకుంటూ మళ్లీ రైతుల వద్ద లంచం తీసుకుంటావా.. సిగ్గులేదా నీకు.. గతంలో ఎన్నో కబ్జాలు జరిగాయి.. వారిపై చూపించు నీ ప్రతాపం అమాయక రైతులపై కాదు.. ఎవరైనా సర్వేయర్లు, వీఆర్‌వోలు లంచాలు అడిగితే సస్పెండ్ చేయిస్తా' అంటూ హెచ్చరించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి రాకపోకవడంపై రోడ్లు భవనాల శాఖ అధికారులను నిలదీశారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కనీసం గుంతలు పూడ్చి సహకరించాలని కోరారు.

గెస్ట్ టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, సెప్టెంబరు 11: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఇంగ్లిషు మీడియంలో గెస్ట్ టీచర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయాధికారిణి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈడీతో పాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు, బీఈడీలోని సంబంధిత సబ్జెక్టులో మెథడాలజీ కలిగి ఉండాలని వివరించారు. స్త్రీలకు జేఎల్ ఇంగ్లిష్ 01, జేఎల్ ఫిజిక్స్ 01, జేఎల్ కామర్స్ 01, పీజీటీ సోషియల్ స్టడీస్ 01, టీజీటీ హిందీ 01, టీజీటీ సోషియల్ స్టడీస్ 02, పీఈటీ 02 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. పురుషుల విభాగంలో జేఎల్ ఫిజిక్స్ 01, పీజీటీ సోషియల్ స్టడీస్ 01, టీజీటీ హిందీ 01, టీజీటీ ఇంగ్లిషు 01, టీజీటీ మ్యాథ్స్ 01, టీజీటీ ఫిజికల్ సైన్స్ 01, పీఈటీ 01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు పూర్తిచేసిన దరఖాస్తులను డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్, ఏపీఎస్ఆర్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం పక్కన, పుత్తూరు రోడ్డు, చిత్తూరు అనే చిరునామాలో అందించాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 17 ఉదయం 10 గంటలకు డెమో తరగతులు ఉంటాయని వివరించారు.

ఇరువర్గాల ఘర్షణ: పలువురికి గాయాలు

సదుం, సెప్టెంబరు 11: రాజకీయ కక్షల నేపథ్యంలో సదుం మండలం పాలమంద పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన ఇరువర్గాల వారు బుధవారం రాత్రి ఘర్షణ పడ్డారు. చౌడేపల్లె రూరల్ సీఐ రాంభూపాల్, సదుం ఎస్ఐ షేక్షావలి కథనం ప్రకారం పాలమందలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన మునీంద్ర గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల పట్ల తీవ్ర వివక్ష చూపించేవారు. దీంతో మునీంద్ర ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఇటీవల కొందరు టీడీపీ వర్గీయులు వాదోపవాదాలు పడుతున్నారు. ఈ క్రమంలో హరిజనవాడలో బుధవారం జరిగిన గ్రామ దేవత జాతర సందర్భంలో కొందరు మునీంద్రతో ఫోన్లో కవ్వించారు. విషయం తెలుసుకుని పెద్దూరు నుంచి మునీంద్ర పక్షాన కొందరు చేరుకుని కత్తులు, కర్రలతో ఘర్షణకు దిగారు. మునీంద్ర వర్గీయులు శివ, ఖాదర్ బాషా, మల్లిఖార్జున, హరినారాయణ, రమేశ్, సలీం, రెడ్డప్ప, లవ్‌కుమార్ తదితరులు గాయపడ్డారు. వీరిని సదుం సీహెచ్‌సీకి తరలించారు. హరిజనవాడకు చెందిన నవీన్, రెడ్డిశేఖర్, రెడ్డి రమేశ్, అప్పరెడ్డి, మనోహర్, తదితరులు గాయపడి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతకుముందు పాలమంద వెళ్లి ఘర్షణలకు పాల్పడకూడదని హెచ్చరించినా ఇరువర్గాలూ ఘర్షణ పడ్డారని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

45మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 11: ఇంటింటికీ నిత్యవసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 45మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది.జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167మంది, పలమనేరు డివిజన్‌లో 169మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17తేదీల మధ్య నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు, వారి సహాయకులకు రూ.3వేలు చొప్పున ప్రభుత్వం జీతం చెల్లిస్తోంది. ఆగస్టు నెలలో కార్డుదారులకు నిత్యవసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 45 మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ డీఎస్వో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పొడిగింపు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 11: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లకు అపరాధ రుసుంతో ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో దేవరాజు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మీసేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా రూ.200 అపరాధ రుసుంతో అడ్మిషన్లు పొందాలని కోరారు. శాంతిపురం, ఐరాల, పూతలపట్టు, పాలసముద్రం, వెదురుకుప్పం, సోమల మండలాల్లో ఓపెన్ స్కూల్ సెంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు.

అరటి పండ్ల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

రూ.15లక్షల ఆస్తి నష్టం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన అరటిపండ్ల గోడైన్లు - పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు11 : నగరి పోలీస్‌స్టేషన్ పక్క సందులోని అరటి పండ్ల గోడౌన్‌లో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.15లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. సీఐ మహేశ్వర్ కథనం మేరకు.. కళందర్, యూనస్, రహమాన్ షెడ్లు ఏర్పాటు చేసుకుని అరటిపండ్ల వ్యాపారం చేస్తున్నారు. మంగళవారం రాత్రి మంటలు ఎగసిపడి గోడౌన్లు పూర్తిగా కాలిపోయాయి. అరటి పండ్లు కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి ఉండొచ్చని భావిస్తున్నారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ కేజే కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన గజదాడులు

- పాతపేటలో పంటల ధ్వంసం



ఏనుగులు నేలకూల్చిన కొబ్బరిచెట్లు - ధ్వంసమైన వరి పంట

కల్లూరు, సెప్టెంబర్ 11: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు మళ్లీ మొదలయ్యాయి. పాతపేట పంచాయతీలో అడుగుపెట్టిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. కొబ్బరి, వరి తదితర పంటలకు అపార నష్టం కలిగింది. మంగళవారం రాత్రి పాతపాళ్యం అటవీప్రాంతం నుంచి పాతపేటకు చెందిన రైతు నందగోపాల్ ఇంటి సమీపానికి చేరుకున్న ఏనుగుల గుంపు పశుగ్రాసం ధ్వంసం చేశాయి. అనంతరం ఘీంకారం చేశాయి. ఈ శబ్దాలకు గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొందరు యువకులు వీటిని తరిమేందుకు బళ్లారి డ్రమ్స్‌తో శబ్దాలు చేశారు. రైతులు కె. మునిరాజ, వై. నారాయణ కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో ఏనుగులు పెకలించాయి. శ్రీనివాసులు, నారాయణ, సుబ్రమణ్యం, చిన్నస్వామికి చెందిన వరి పంటను ధ్వంసం చేశాయి. సుమారు మూడెకరాల వరి పంట పూర్తిగా దెబ్బతింది. రైతు సుబ్రమణ్యంకు చెందిన అరెకరా టమోటా పంటను ఏనుగులు పాడు చేశాయి. పాతపాళ్యం అడవి నుంచి సుమారు నాలుగు ఏనుగులు వచ్చి నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఏనుగుల దాడులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పండించామని, చేతికొచ్చే సమయంలో ఏనుగులు దాడులు చేశాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

చెరువుకోన వద్ద మకాం

సోమల, సెప్టెంబరు 11: సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీలో చెరువుకోన వద్ద ఏనుగులు వారం రోజులుగా మకాం వేశాయి. తాగునీరు, అడవి సమీపంలోనే పొలాలు ఉండడంతో వాటికి ఇక్కడే ఆవాసంగా మారిందని రైతులు తెలిపారు. మంగళవారం రాత్రి గురికానివారిపల్లె సంచరించడంతో వరి, టమోటా, చెరకు తోట ధ్వంసమైనట్లు బాధితులు పేర్కొన్నారు. అడవిపందులకు తోడు ఏనుగుల రాకతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

49 మంది మహిళా పోలీసులకు కౌన్సెలింగ్



మహిళా పోలీసు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

చిత్తూరు, సెప్టెంబరు 11: జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు మహిళా పోలీసులకు బుధవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 140 మంది హాజరయ్యారు. ముందుగా వారికి పోస్టింగ్స్‌కు సంబంధించిన నియమ నిబంధనల గురించి ఎస్పీ మణికంఠ చందోలు వివరించారు. పోస్టింగ్ కోరుకున్న ఉద్యోగి తన స్వగ్రామం, వార్డు ఉండే సచివాలయం కాకుండా ఇతర సచివాలయాలను కోరుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న సచివాలయాల ఆప్షన్లను ప్రొజెక్టర్ డిస్‌ప్లేపై ఉంచి ఒక సచివాలయాన్ని ఎంపిక చేసుకోవాలని ఉద్యోగులకు అవకాశం ఇచ్చారు. దాంతో 49 మంది ఉద్యోగులకు పోస్టింగ్‌లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఏవో మోహనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు..

చిత్తూరు సిటీ: జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం ఎస్ఈ చంద్రశేఖర్ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉద్యోగుల అభ్యర్థన మేరకు వారిదరఖాస్తులను పరిశీలించి ఉద్యోగుల బదిలీలు చేశారు.

ఆర్టీసీ జోన్ 4 ఈడీగా చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 11: ఆర్టీసీ కడప జోన్ 4 ఫుల్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిమ్మాడి చెంగల్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న గిడుగు వెంకటేశ్వర్లు రెండు నెలల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే.తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారిగా వున్న టి.చెంగల్‌రెడ్డిని ఫుల్‌చార్జ్ ఈడీగా నియమిస్తూ ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమల రావు ఉత్తర్వులు జారీచేశారు.రాయలసీమ పరిధిలోని తిరుపతి, చిత్తూరు,కడప, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.

వెల్లువెత్తిన మానవత్వం

● వరద బాధితులకు మదనపల్లె వాసుల అండ ● నిత్యావసర వస్తువులు కూరగాయల తరలింపు ● సీఎంఆర్ఎఫ్‌కు నగదు విరాళం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11: వరద బాధితులకు మదనపల్లె నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక టౌన్‌హాల్లో 3 వేల నిత్యావసర కిట్లు, 500 గ్యాస్ స్టౌవ్‌లు, ఇతర సామగిని ప్యాక్ చేసి లారీలకు లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె ప్రజలు తమ వంతుగా అందజేసిన విరాళాలతో పాటు, తన వంతు రూ.5 లక్షలు వెచ్చించి ఐదు వేల మందికి సరిపడా సరుకులు, వస్తువులు సిద్ధం చేశామన్నారు. మదనపల్లె నుంచి 20 మంది టీడీపీ నాయకులతో విజయవాడకు వెళ్లి అక్కడ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఈ కిట్లను పంపిణీ చేస్తామన్నారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ వారం రోజులుగా వరద బాధితుల అవస్థలు, వారిని ప్రభుత్వం, అధికారులు ఆదుకుంటున్న తీరును నిత్యం దినపత్రికలు, టీవీల్లో చూస్తున్నామని, దీనికి స్పందించి మదనపల్లె ప్రజలు ఈ విరాళాలను అందించడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు విద్యాసాగర్, రామకృష్ణాచారి, బాలుస్వామి, శివన్న, షంషీర్, సంగం హరి తదితరులు పాల్గొన్నారు.

8 టన్నుల టమోటా తరలింపు

మదనపల్లె టమోటా యార్డులోని మండీ యజమానులు 8 టన్నుల టమోటాను సరఫరా చేశారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో టమోటాలను నింపిన లారీకి మండీ యజమానులు నాగయ్య, ఎస్‌పి మస్తాన్ జెండా ఊపి విజయవాడకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనలతో 8 టన్నుల టమోటాలను ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టమోటా మండీ యజమానులు ఖాసీమ్, ఖాజా, టీపీఎస్ బాబు, సురేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థుల ఆర్థిక సాయం

మదనపల్లె అర్బన్: స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు ప్రిన్సిపాల్ ఎన్ సేతు ఆధ్వర్యంలో రూ. 50 వేలు ఎమ్మెల్యే షాజహాన్ చేతుల మీదుగా సీఎం సహాయనిధికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలోని వారికి సాయం చేయాలనే ఆలోచన రావడమే గొప్ప విషయం అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎంవీఆర్ లాడ్జి యాజమాని వెంకటరమణ ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ. 2 లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షంషీర్, నాగూర్‌వలి, జేసీబీ వేణు, శివన్న. లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు పంపే నిత్యావసర వస్తువులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



విజయవాడకు టమోటాలను పంపుతున్న మండీ యజమానులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ప్రకాష్‌నాయక్ (ఫైల్ ఫొటో)

ములకలచెరువు, సెప్టెంబరు 11: నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వంతెనను ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం సుబ్బరాయునిపల్లెకు చెందిన బుక్కే శ్రీరాములునాయక్ కుమారుడు ప్రకాష్‌నాయక్(22) తిరుపతిలోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతని కుటుంబం కూడా అక్కడే ఉంటోంది. వినాయకచవితి పండగ సందర్భంగా ప్రకాష్ నాయక్ ఈ నెల 7న ద్విచక్రవాహనంలో స్వగ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంలో తిరుపతికి వెళుతూ ములకలచెరువు మండలం పెద్దపాళ్యం వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వంతెనను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ గాయత్రి పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేరువేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11: వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యాయత్నం చేసిన ముగ్గురు బుధవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వచ్చారని ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు మదనపల్లెకు చెందిన వివాహిత వసంత(28)కుటుంబసభ్యులతో గొడవపడి పురుగులు మందుతాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండకు ,చెందిన తేజస్విని(34) మంగళవారం రాత్రి పురుగులమందు తాగింది, మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (32) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వారి వారి కుటుంబసభ్యులు వారిని చికిత్స కోసం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

దారి వివాదం పరిష్కరించలేదని..

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11: పొలానికి దారి చూపాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు మండలంలోని చల్లావాండ్లపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్ (46)కు తన పొలానికి దారి విషయంలో దాయాదులతో వివాదం ఉంది. ఈ విషయంలో న్యాయం చేయాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో మస్తాపానికి గురై బుధవారం పొలం వద్ద విషం తాగాడు, గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పది మంది జూదరుల అరెస్టు

కలకడ, సెప్టెంబరు 11:మండలంలోని కదిరాయచెరువు పంచాయతీ పిల్లగోవులవారిపల్లె సమీపంలో బావి వద్ద జూదం ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. వారి నుంచి రూ.21,400 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. సిబ్బంది హరిబాబు, రమేష్, కరుణాకర్, అహ్మద్ అలీ, రమేష్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

అధికారుల ఒంటెద్దు పోకడతో కార్మికుల పస్తులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో అధికారుల ఒంటెద్దు పోకడలతో అవుట్‌సోర్సింగ్ కార్మికులు పస్తులుండాల్సి వస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు టి.కృష్ణప్ప ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద కార్మికులతో కలసి, సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కృష్ణప్ప మాట్లాడుతూ 13 నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికుల పనిదినాల వివరాలను సకాలంలో ఆబ్‌కాస్‌కు అధికారులు పంపకపోవడంతో వేతనాలు అందలేదన్నారు. దీనిపై వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా అధికారులు స్పందించలేదన్నారు. పరిస్థితి మారకుంటే ప్రభుత్వా స్పత్రి ఎదుట రిలే దీక్షలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ ముబారక్, అమరావతి, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, పెద్దన్న, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులు, సీపీఐ నాయకులు

అందరికీ పని.. ప్రభుత్వ ధ్యేయం : ఏపీడీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 : జాబ్‌కార్డు కలిగి ఉన్న అందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ మధుబాబు సూచించారు. బుధవారం ఆయన మండలపరిషత్ కార్యాలయంలో ఏపీవో తిరుపాలప్పతో కలసి ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉపాధి హామీలో పండ్లతోటలు, పూలతోటల సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను రైతులకు వివరించాలన్నారు. సకాలంలో బిల్లులు పెట్టి కూలీలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎన్. బాలాజీ, ఈవోపీఆర్డీ యోగానంద్, తో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 : మండల పరిధిలో పక్కా గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో కేఎన్ బాలాజీ సూచించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ యోగానంద్, లేఔట్ స్పెషలాఫీసర్ తిరుపాలప్పతో కలసి మండలంలోని రంగసముద్రంలోని లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండలానికి 2,348 ఇండ్లు మంజూరు కాగా, 1,155 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఇప్పటికీ నిర్మాణాలు మొదలు పెట్టని 34 గృహాలను గుర్తించామన్నారు. మార్చి 21 లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుంటే బిల్లులు మంజూరు కావని హెచ్చరించారు. సర్పంచ్ శివప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, శివప్రసాద్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

కురబలకోట, సెప్టెంబరు 11: ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలను కొందరు అడ్డుకుంటున్నారని తహసీల్దార్ తపస్విని, ఎంపీడీవో హరినారాయణకు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. కురబలకోట మండలం కంటేవారిపల్లెలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన కాలనీలో ఇళ్లు నిర్మిస్తే కూల్చేస్తామని కొందరు బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు.

కన్వర్షన్ కోసం భూముల పరిశీలన

కలికిరి, సెప్టెంబర్టు 11: కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ భూములను మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ గురువారం పరిశీలించారు. మండలంలోని గుండ్లూరు గ్రామంలో వ్యవసాయేతర అవసరాల కోసం భూ మార్పిడికి ప్రతిపాదించిన భూముల రికార్డులతోపాటు, క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియనుపూర్తి చేయాలని రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. కుల ధ్రువీకరణ పత్రాలు తిరస్కరించకుండా క్షేత్రస్థాయిలో మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తహసీల్దారు మహేశ్వరీ బాయి పాల్గొన్నారు.

రీజియన్‌లో ఆర్టీసీ వన్‌డిపో మొదటి స్థానం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11: నేటి వరకు మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో రీజియన్‌లో మొదటి స్థానంలో ఉందని బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆ డిపో డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈపీకే 37.48తో ఓఆర్ 60 శాతం సాధించిన ఆర్టీసీ మదనపల్లె వన్ డిపో ఉద్యోగులను ఆయన అభినందించారు.

ఐటీఐ కోర్సులతో సత్వర ఉపాధి...

తంబళ్లపల్లె సెప్టెంబరు 11 : ఐటీఐ కోర్సులతో తక్కువ సమయంలోనే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని టి.ఎన్. వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం తంబళ్లపల్లె ఐటీఐలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఇర్వహించిన జాబ్‌మేళాకు 46 మంది హాజరయ్యారు. ఇన్నోవా సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంధార్ టెక్నాలజీస్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 21 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి నెలకు రూ. 13 వేల నుంచి రూ. 25 వేల వరకు వేతనాలు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్‌తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో నెల నెలా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో దొణప్పకోరారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ వెంకటేష్, కోఆర్డినేటర్ చౌడయ్య, తంబళ్లపల్లె ఐటీఐ టీఓ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, అశోక్, రమణ పాల్గొన్నారు.

పీలేరు: పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన మినీ జాబ్ మేళాలో 31 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ మేళాలో 5 కంపెనీలు పాల్గొనగా 67 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలోని తమ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 180 మందికి శిక్షణ ఇచ్చామని, వారిలో 113 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగులుగా మారారని వివరించారు.

రేపు కలికిరి మండల సమావేశం

కలికిరి, సెప్టెంబర్టు 11: కలికిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 24న జరగాల్సిన మండల సమావేశం కోరం లేక వాయిదా పడింది. వారం రోజుల తరువాత వైసీపీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు నగరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఇంటి వద్ద హాజరయ్యారు. మండలం అభివృద్ధి కోసం ఎమ్మెల్యేతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం నాటి సమావేశం ఆసక్తిదాయకం కానుందని చెపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కలకడ, సెప్టెంబరు 11: స్థానిక సత్యవతి నది బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. సంబేపల్లి మండలం ఆగ్రహారానికి చెందిన ఎన్‌పీ నాగన్న, కలకడ మండలం గొల్లపల్లికి చెందిన రామచంద్ర ద్విచక్ర వాహనంలో కలకడకు వస్తుండగా, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహన ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగన్నను కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. రామచంద్ర స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది.

వేడుకగా వినాయక నిమజ్జనం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11: మదనపల్లె పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను బుధవారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్‌లో ఉట్లోత్సవం నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. రామిరెడ్డిలేవుట్‌కు చెందిన కాలా సోమేశేఖర్, ఆర్ మంజునాథ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రశాంతనగర్‌లోని వినాయక విగ్రహాన్ని తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. ప్రజలు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ములకలచెరువు: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ట్రాక్టర్ నడిపి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. పోలీస్‌స్టేషన్, నల్లగుట్ట, ఉర్దూ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలకు కూడా నిమజ్జనం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ నేత మంత్రి గిరిధర్డ్డి, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: పాత కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని పట్టణంలో ఊరేగించి నిమజ్జనం చేశారు.

నిమ్మనపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మంగళవారం నిమజ్జనానికి తరలించారు. గొడవలు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

కురబలకోట: మండలంలోని అంగళ్ళు, కురబలకోట, ముదివేడు, మట్లివారిపల్లె ల్లో వినాయకుడి ప్రతిమలను ఊరేగించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులలో నిమజ్జనం చేశారు

గుర్రంకొండ: పట్టణంలోని కొత్తపేటలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను బాణసంచా పేలుళ్ల, మంగళవాయిద్యాలు, కోలాటాలు, కేరింతలు, నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలించారు.



అంగళ్లులో వినాయకుడి నిమజ్జనం చేస్తున్న యువకులు

కలకడ:మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో గణనాథుడికి టీడీపీ నాయకుడు మలిగి మధుసూదన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డు వేలం నిర్వహించగా రూ.33,300కు దిగువ బజారుకు చెందిన గార్లపేట కళ్యాణి దక్కించుకున్నారు. సాయంత్రం నిమజ్జనం చేశారు. చింతకాయల వినోద్, రెడ్డి ప్రసాద్, నరసింహులు, లక్ష్మిపతి హేమంత్, రాజేష్, నవీన్, గణేష్, సప్పి రాజు, శేఖర్ పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

వెలిగల్లు గణపతి లడ్డూ రూ.3 లక్షలు

పెద్దమండ్యం: పెద్దమండ్యం మండలం వెలిగల్లులో బుధవారం గణపయ్య మండపంలో ఏర్పాటు చేసిన 15 కిలోల లడ్డూను వేలం వేయగా, రూ.. 3 లక్షలకు వెలిగల్లు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడప రామాంజులు దక్కించుకున్నారు. రామాంజులు నాయుడు, అడప భాస్కర, భరత్ కుమార్‌రెడ్డి, ఆంజి, బావాజాన్, మహబూబ్ పీరా, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడు గంటలు ఆలస్యంగా సెవెన్‌హిల్స్ రైలు

ములకలచెరువు, సెప్టెంబరు 11: సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా బుధవారం తిరుపతికి వెళ్లాల్సిన సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు సుమారు 3 గంటలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక కారణాలతో ఈ రైలు కాచిగూడలో మూడు గంటల పాటు ఆగిపోయింది. దీంతో తెల్లవారుజామున 2.49 గంటలకు ములకలచెరువుకు రావాల్సిన రైలు ఉదయం 5.49 గంటలకు వచ్చింది. మదనపల్లె రోడ్‌కు 3.19 గంటలకు వెళ్లాల్సిన రైలు ఉదయం 6.19 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 7.02 గంటలకు, పీలేరుకు 4.09 గంటలకు వెళాల్సి ఉండగా ఉదయం 7.17 గంటలకు, పాకాల జంక్షన్‌కు 4.59 గంటకు వెళ్లాల్సి ఉండగా 7.48 గంటలకు, తిరుపతికి ఉదయం 6.25కు వెళ్లాల్సి ఉండగా 8.49 గంటలకు వెళ్లింది. దీంతో రైలులో ప్రయాణించేందుకు టికెట్‌లు బుక్ చేసుకున్న, రైలులో ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైలు కోసం గంటల తరబడి రైల్వేస్టేషన్లలో వేచి చూడాల్సి వచ్చింది.

రైతు బజార్ ప్రారంభానికి చర్యలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11: పట్టణ నడిబొడ్డున ఉన్న రైతుబజార్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీ త్యాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక రైతుబజార్‌లో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌కు, వారపుసంతకు మధ్య అడ్డంగా ఉన్న రెండు గోడలను తొలగిస్తున్నామన్నారు. దీని ద్వారా రైతులు వారపుసంత నుంచి నేరుగా రైతుబజార్‌లోకి ఉత్పత్తులను తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు కూడా వారపుసంత నుంచి రైతుబజార్‌లోకి వచ్చేందుకు వీలుంటుందన్నారు. రైతు బజార్ కారణంగా వారపుసంతలో వ్యాపారులు ఉపాధి కోల్పోయే విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వారికి ఉపాధి కలిగించే మార్గాలను అన్వేషిస్తామన్నారు. రైతుబజార్‌లో విక్రయాలు నిర్వహించదలిచే రైతులు జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సెక్రటరి అభిలాష్ పాల్గొన్నారు.

చెరువు కట్ట విస్తరణ పనులకు ప్రతిపాదన



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ అహ్మద్

పెద్దమండ్యం, సెప్టెంబరు 12: మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి చెరువు కట్ట విస్తరణ, అభివృద్ధి పనులకు మండల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సోమవారం రాత్రి ట్రాక్టర్ చెరువులో పడడంతో అఫ్జల్ అనే విద్యార్థి మృతి చెందగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. మంగళ వారం జిల్లా కలెక్టరు చామకూరి శ్రీధర్ గుడిసెవారిపల్లి చెరువును పరిశీలించారు. చెరువు కట్ట విస్తరణ, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని మండల అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు సమావేశమై సుమారు రూ. 35 లక్షల అంచనాతో నివేదికను సిద్ధం చేశారు. . తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఉపాధి పథకం ఏపీవో మురళి, వీఆర్వో నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

పెద్దమండ్యం,సెప్టెంబరు 11: మండలం లోని పేద విద్యార్థులకు బుధవారం పోర్డు సంస్థ మండల కో ఆర్డినేటర్ నరసింహులు ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, బలపాలు ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని మండ్యం హరిజనవాడ, మిట్టామాలపల్లి, బత్తినిగారిపల్లి, దట్టేనాయక్ తండాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేసినట్లు నరసింహులు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలన తమ ధ్యేయమన్నారు. ఆయా పాఠశాల ఉపాధ్యాయులు చలపతి, రమణ, హరి, నాగమల్‌రెడ్డి, సంస్థ సిబ్బంది భువనేశ్వరి, రెడ్డమ్మ, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు స్కూల్ గేమ్స్ నిర్వహణ

నిమ్మనపల్లి, సెప్టెంబరు 11: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక జడ్పీహైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, యోగా, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో నారాయణ బుధవారం తెలిపారు. మండలంలోని హైస్కూళ్లలో చదివే విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని వివరించారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



ఈవోతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పీలేరు, సెప్టెంబరు 11: పీలేరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ నాయకులు పంచాయతీ ఈవో గురుప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. పీలేరులో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో సీపీఐ నాయకులు సాంబశివ, టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతోపాటు, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన కొంతమంది నాయకులు తమ అనుచరులైన 49 మందిని పంచాయతీ కార్మికులుగా నమోదు చేయించి, వారిని జీతాలు చెల్లించారని ఆరోపించారు. అటువంటి చెడు సంప్రదాయాలకు స్వస్తి పలకాలని కోరారు. పీలేరు పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించాలన్నారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందించారు.

ల్యాబ్ టెక్నీషియన్‌లపై చర్యలు తీసుకోవాలి

పీలేరు, సెప్టెంబరు 11: పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తూ, ప్రైవేటు ల్యాబ్‌లు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్(డీబీఎస్ఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరులో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే చాలా మంది రోగులను ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలు చేసుకోవాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులు లేని ఆ ల్యాబుల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రైవేటు ల్యాబులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కురబలకోట, సెప్టెంబరు 11: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యూజీసీ ఛైర్మన్ యం. జగదీష్‌కుమార్ అన్నారు. బుధవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడాపై ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. కళాశాల ప్రాంగణంలో పరిశుభ్రత స్థాయిలను మెరుగుపరచుకునేందుకు ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు.

మెరిట్ విద్యార్థినులకు నగదు బహుమతులు

కలికిరి, సెప్టెంబర్టు 11: ఎస్సెస్సీ పరీక్షల్లో ప్రతిభ ప్రదర్శించిన ముగ్గురు మండలంలోని మహల్ ఉన్నత పాఠశాల (తెలుగు) విద్యార్థినులకు ఆ పాఠశాల విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ నగదు బహుమతులు అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎస్.ఉమేసల్మాకు రూ.3116లు, కె.శశిప్రియకు రూ.2116లు, ఎస్.సాజీదాకు రూ.1116లు అందజేశారు. ప్రతిభను ప్రోత్సహిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడిని హెచ్.ఎం. చెంగ్రాయుడు, గణిత ఉపాధ్యాయుడు నాగసుబ్బయ్య తదితరులు అభినందించారు.

జేఎన్టీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



శివకుమార్

కలికిరి, సెప్టెంబర్టు 11: కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి. శివకుమార్‌కు డాక్టరేట్ మంజూరైంది. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ స్ట్రక్చర్ ఫొటో ల్యుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ అర్త్ అయాన్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగానూ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ నాగప్రసాద్ నాయుడు ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. చిత్తూరు 'సీతమ్స్' ఇంజినీరింగ్ కళాశాల ఫిజిక్స్ హెచ్ఓడీ ఉమామహేశ్వరి, కలికిరి జేఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ త్యాగరాజన్ పర్యవేక్షణలో చేసిన పరిశోధన పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించినట్లు ఈ నోటిఫికేషన్‌లో తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్‌ను పలువురు హెచ్‌ఓడీలు, సహ అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 11: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలని ఎంపీడీవో కె.ఎన్. బాలాజీ సూచించారు. బుధవారం ఎంపీడివో కె.ఎన్. బాలాజీ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను, వంటగదిని పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులను, పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు. ఈవోపీఆర్డీ యోగానంద్, ప్రధానోపాధ్యాయురాలు అపర్ణాదేవి, స్థానిక పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, వెల్ఫేర్ అసిస్టెంట్ సుల్తానా, డిజిటల్ అసిస్టెంట్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, మందులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి..

రామసముద్రం, సెప్టెంబరు 11: ఎరువులు, మందులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శంకర్ సూచించారు. మండలంలోని ఎరువులు, మందులు దుకాణాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల పట్టీల ను ప్రతిరోజు బోర్డులో రాయాలన్నారు. ఎరువులు తీసుకున్న ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలన్నారు. దుకాణాల్లో, ఆర్బీకే కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందకుండా పొందవచ్చునన్నారు. ఎవరైనా దుకాణదారులు యూరియా విక్రయించ కుండా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే అలాంటివారి లైసెన్సు రద్దు చేస్తామని శంకర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ పాల్గొన్నారు.